


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 112, పేజీలు - 08

గురువారం, ఆగష్టు 22, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



## రేవంత్ రెడ్డి దూకుడు.. బలమా.?

## బలహీనతా.?


### - తెర వెనక ఏం జరుగుతోంది.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మాటలు కోటలు దాటుతున్నాయి. నేతలు నిగ్రహం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇంకా తాము ప్రతిపక్షంలోనే ఉన్నామన్నట్లు వ్యవహరిస్తుండగా, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు తాము ఇంకా అధికారంలో ఉన్నామన్న భావనలోనే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ఈ ధోరణి అధికార పార్టీ నేతల్లో మరింత అసహనం పెంచుతోంది. అధికారంలో లేకపోయినా అధికారంలో ఉన్న నేతలను ధూషించడాన్ని సహించలేకపోతున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను అటాక్ చేస్తున్నారు. విపక్షంలో ఉన్నపట్టిలాగే దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తన పదునైన మాటలతో చీల్చి చెండాడుతున్నారు. అధికారం చెప్పట్టినప్పటి నుంచి ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి వస్తామని బెదిరించడంతో ముందుగా వీఆర్ఎస్ పార్టీనే

6లో ▶

## చంపైయి సోరెన్ కొత్త పార్టీ

- వేగంగా మారుతున్న జార్ఖండ్ రాజకీయ పరిణామాలు
- జేఎంఎంలో అవమానాలు ఎదుర్కొన్నానన్న చంపయి సోరెన్
- ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సిన సమయం ఆసన్నమయిందని వ్యాఖ్య



**రాంచి (ప్రశ్న న్యూస్)** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపైయి సోరెన్ కొత్త పార్టీ పెట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. జార?ండ్ ముక్తి మోర్చా నేతగా ఉన్న ఆయన హేమంత్ సోరెన్ ను సీబీఐ అరెస్టు చేసిన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టారు. హేమంత్ సోరెన్ కు బెయిల్ వచ్చిన తర్వాత ఆయన రాజీనామా చేశారు. మళ్లీ హేమంత్ సోరెన్ సీఎం అయ్యారు. అయితే తనకు పార్టీలో అవమానాలు జరుగుతున్నాయని ఆయన గత వారం రోజులుగా అలజడి రేపుతున్నారు. బీజేపీతో చర్చలు జరిపారని ఆ పార్టీలో తన మద్దతుదారులతో కలిసి చేరిపోవడమే మిగిలిందని అనుకున్నారు. ఆయనతో ఐదారుగురు జార?ండ్ ఎమ్మెల్యేలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

### బీజేపీలో చేరడం కన్నా సొంత పార్టీ ఏర్పాటుకే మాజీ సీఎం నిర్ణయం

అయితే చంపైయి సోరెన్ మాత్రం తన ముందు మూడు దారులు ఉన్నాయని ప్రకటించారు. రిటైర్మెంట్ కావడం .. కొత్త పార్టీని ఏర్పాటు చేసుకోవడం.. పొత్తులుపెట్టుకోవడం అని చెప్పుకొచ్చారు. రిటైర్మెంట్ అయ్యే అవకాశం లేదని.. రాజకీయాల్లో కొనసాగుతానని ప్రకటించారు. కొత్త పార్టీ పెట్టకుంటానని స్పష్టం చేశారు. తనతో కలసి వచ్చే వాళ్లు రావొచ్చన్నారు. జార?ండ్‌లో వచ్చే నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ కారణంగా ఎంత మంది ఎమ్మెల్యేలను చంపైయి సోరెన్ ఆకర్షించినా ప్రస్తుతానికి ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని భావిస్తున్నారు. చంపైయి సోరెన్ తిరుగుబాటుతో జార?ండ్ ముక్తి మోర్చా చీలుతుందా సమైక్యంగా హేమంత్ సోరెన్ వైపే ఉంటుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### జేఎంఎం ఓట్లు చీల్చే వ్యూహమా.?

జార?ండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం జేఎంఎం పార్టీ ఆవిర్భవించింది. ఉద్యమం ద్వారా అనుకున్నది సాధించింది. హేమంత్ సోరెన్ తండ్రి షిబూసోరెన్ ఉద్యమాన్ని నడించారు. ఆయన వయసు కారణంగా రాజకీయాలకు దూరమయ్యారు. ఆయన వారసత్వాన్ని అంది పుచ్చుకుని హేమంత్ సోరెన్ జార?ండ్‌లో కీలక నేతగా ఎదిగారు. మొదటి నుంచి జేఎంఎం కాంగ్రెస్ మిత్రపక్షాల్లో ఉంది. ఇప్పటికీ యూపీఏలో భాగస్వామినే. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ క్రమంలో బీజేపీ అక్కడ రాజకీయ వ్యూహాలకు పదును పెట్టింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న పట్టుదలతో జేఎంఎం కీలక నేతలను ఆకర్షిస్తోంది.

### నవంబర్‌లో జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు

మాజీ ముఖ్యమంత్రి అయిన చంపైయి సోరెన్ ను పార్టీలో చేర్చుకోవడం కన్నా ఆయనతో సొంత పార్టీ పెట్టించి పోటీ చేయించడం వల్ల జేఎంఎం ఓట్లు చీలిపోతాయని దాని వల్లనే ఎక్కువ బీజేపీకి లాభం

6లో ▶

## నాకు ఏ ఫాం హౌస్ లేదు

- జన్వాడ ఫాంహౌస్‌పై కేటీఆర్ స్పందన
- తనకు ఎలాంటి ఫాంహౌసులు లేవని క్లారిటీ
- తన ఫ్రెండ్ ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నట్లు స్పష్టం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలపై బుల్డోజర్ల ప్రయోగం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హైడ్రా కూల్చివేతల లిస్టులో రాజకీయ ప్రముఖులకు సంబంధించిన ఆస్తులు కూడా ఉండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధించిన జన్వాడ ఫాంహౌస్ కూడా బఫర్ జోన్‌లోనే ఉందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆ వార్తలపై స్పందించిన కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్ మీద క్లారిటీ ఇచ్చారు. తనకు సొంతగా ఎలాంటి ఫాంహౌస్‌లు లేవని కేటీఆర్ స్పష్టం చేశారు. తన స్నేహితుడి ఫాంహౌస్ లీజు తీసుకున్నానని తెలిపారు. ఆ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్‌లో ఉంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని చెప్పుకొచ్చారు. కేవీపీ, మహేందర్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలకు ఫాం హౌస్ లు ఉన్నాయని అవసరమైతే అవి ఎక్కడ ఉన్నాయో చూపిస్తాయన్నారు. జన్వాడతో ఇతర ఫాం హౌస్ లపై అక్కడే కూర్చుని అన్ని వివరాలు పరిశీలించి, చర్యలు తీసుకుందామా అంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీని వెంటాడుతామన్నారు. “నేను అక్రమంగా ఏదైనా తప్పు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకోండి. బఫర్ జోన్‌లో ఎవరి నిర్మాణాలు ఉన్నా సరే కూల్చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. తప్పు నేను చేసిన సరే, నాపై చర్యలు తీసుకోండి. నాకు ఫామ్ హౌస్ లేదు. నా ఫ్రెండ్ ఫామ్ హౌస్ ను లీజు తీసుకున్నా. ఒకవేళ ఆ ఫామ్ హౌస్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చేయండి. అదే విధంగా మంత్రులు,

6లో ▶

## అచ్యుతాపురం సెజ్‌లో పేలిన రియాక్టర్

- వేఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్ సైన్స్‌లో పేలుడు
- వేమధ్యాహ్నం లంచ్ సమయంలో పేలిన రియాక్టర్
- వేఘటనలో 16కు చేరిన మృతులు
- వేఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, నేడు పర్యటన



**అనకాపల్లి (ప్రశ్న న్యూస్)** అచ్యుతాపురం సెజ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అనకాపల్లి జిల్లాలో ఉన్న అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలుడుతో భారీగా మంటలు చెలరేగాయి. అనకాపల్లి జిల్లా రాంబల్లి మండలం అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు 16 మంది చనిపోయినట్లు అధికారులు వెల్లడించగా..

6లో ▶

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూ సేకరణకు ఆదేశాలు

### - అలైన్‌మెంట్‌లో మార్పులకు రేవంత్ రెడ్డి సూచన




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రీజినల్ రింగు రోడ్డు పనుల్లో పురోగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు, రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారం తనకు అందజేయాలని రేవంత్ సూచించారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను సీఎంకు అధికారులు తెలిపారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని విషయంలో రోజు వారీగా ఏం చేశారు, ఏం పురోగతి సాధించారో ప్రతి రోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలపాలని ఆదేశించారు. అదే విధంగా దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం, ఇతర విషయాలపై సైతం కలెక్టర్లు ప్రతి రోజు సీఎస్ కు వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణ పారదర్శకంగా జరగాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయాలన్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలపై ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఒక సమీక్షకు తరువాతి సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పనుల్లో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఆర్ఆర్ఆర్

6లో ▶

## బొత్సకు డబుల్ బొనాంజా

### - ఎమ్మెల్సీగా ఏకగ్రీవం, ఆ వెంటనే కీలక పదవి



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ గడువు పూర్తి అయ్యే సమయానికి బొత్స సత్యనారాయణ ఒక్కరే నామపత్రాలు దాఖలు చేశారు. దీంతో పోటీలో ఎవరూ లేకపోవడంతో ఆయనే ఏకగ్రీవంగా విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ క్రమంలోనే ఆయన ఎమ్మెల్సీగా గెలవడంతో శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు తన చాంబర్‌లో బొత్స సత్యనారాయణతో ఎమ్మెల్సీగా ప్రమాణం చేయించారు. ఇక ఈ విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం జనసేన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పోటీ చేయలేదు. దీంతో వైసీపీ తరపున నామినేషన్ వేసిన బొత్స సత్యనారాయణ ఒక్కరే బరిలో నిలవడంతో ఆయననే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికైనందున ఆయనను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా వైఎస్ జగన్‌ను బొత్స సత్యనారాయణ కలిశారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నేతగా బొత్స సత్యనారాయణ నియామకం అయ్యారు. ఇప్పటివరకు ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ మోషేన్ రాజుకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే బొత్స సత్యనారాయణను శాసనమండలి పక్షనేతగా నిర్ణయిస్తూ వైసీపీ అధిష్ఠానం లేఖ ఇవ్వనుంది. మరోవైపు

6లో ▶

## సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు షురూ

- పంచాయతీ ఎన్నికలపై ఈసీ సమీక్ష
- ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- సెప్టెంబర్ 21న వార్డుల వారీగా తుది జాబితా




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో మరో ఎన్నికల సంబురం షురూ కానుంది. ఈసారి

6లో ▶

## టెన్షన్ పెడుతున్న మంకీపాక్స్

- ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మంకీపాక్స్ వేగంగా వ్యాపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతోంది. పొరుగుదేశాల్లోనూ కేసులు నమోదవడంతో కేంద్రం మరింత అప్రమత్తమైంది. దాయాది దేశం పాకిస్తాన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేకాదు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగుచూసింది. సౌదీ నుంచి పీఓకేకి వచ్చిన

6లో ▶

## పరువు నష్టం కేసులో సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పరువునష్టం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోర్టు నోటీసులు జారీ చేసింది. నాంపల్లి స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం నాడు నోటీసులు జారీ చేసింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు సీఎం రేవంత్ రెడ్డిపై పరువు నష్టం దావా వేశారు. పిటిషన్ విచారించిన కోర్టు సీఎం రేవంత్ కు సమన్లు జారీ

6లో ▶

## వచ్చే నెలలోనే జనగణన ప్రారంభం

### - 4 ఏళ్లుగా వాయిదా పడిన జనాభా లెక్కలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న దేశంలో జనగణనకు వచ్చే నెలలో ముహూర్తం ఖరారు కానుంది. సెప్టెంబర్ నుంచి దేశంలో జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. దేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతీ 10 ఏళ్లకు ఒకసారి కచ్చితంగా జరిగే జనాభా లెక్కల ప్రక్రియ వాస్తవానికి 2021 లోనే జరగాల్సి ఉంది. కానీ అప్పుడు దేశంలో కరోనా మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం.. ఈ ప్రక్రియను

6లో ▶

## రేవంత్, హరీష్ ఎవరొచ్చినా ఓకే

- బీజేపీలోకి చేరికలపై కేంద్ర మంత్రి బండి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీజేపీ పార్టీలో చేరికలపై తెలంగాణ బీజేపీలో కీలక నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో చేరేందుకు ఎవరొచ్చినా తాము ఆహ్వానిస్తామన్న ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు సహా ఎవరు పార్టీలో చేరుతామన్నా అక్కున చేర్చుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఎవరు ముందుకు వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. హరీష్ రావు పార్టీ మారుతారంటూ కొద్దిరోజులుగా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. హరీష్‌రావుతో

6లో ▶

## గ్రౌండ్ బెస్ట్ లర్నింగ్ కార్యక్రమంను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బుధవారం మెదక్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని ఎంపిక చేయబడిన 20 మంది విషయ నిపుణులకు గణితం ,భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, మరియు జీవశాస్త్రం లపై జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాధికారితో కలిసి గ్రౌండ్ బేస్డ్ లర్నింగ్ కార్యక్రమం పై దిశానిర్దేశం చేశారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను అర్థవంతంగా నిజజీవితంలో ఉపయోగించుకునే విధంగా తయారు చేయాలని ఆ దిశగా కంటెంట్ రూపొందించాలని వివిధ పాఠశాలల నుండి ఎంపిక చేసిన విషయ నిపుణులకు సలహాలు సూచనలు ఇచ్చారు.ఆరు నుండి పదవ తరగతి వరకు తరగతిల వారీగా పైన తెలిపిన సబ్జెక్టుల వారిగా తయారు చేయాలని తదుపరి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో అమలు చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మరియు వివిధ పాఠశాల నుండి వచ్చిన విషయ నిపుణులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మహిళల ఫుట్బాల్ రన్నర్ గా మెదక్ జిల్లా జట్టు ఎంపిక

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును జిల్లాతెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు నిజాంబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల ఫుట్బాల్ ఛాంపియన్షిప్ లో రన్నరపుగా నిలిచిన ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన చాంబర్లో క్రీడాకారులను,వీరితోపాటు జాతీయస్థాయిలో జూనియర్ ఫుట్బాల్ విభాగంలో బంగారు పథకం సాధించిన అంకిత్ ను అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తుంది అన్నారు .మెద క్ లోని ఇందిరాగాంధీ స్టేడియం మరమ్మత్తులను ఇప్పటికే పూర్తి చేసి ఫుట్బాల్ క్రీడా మైదానాన్ని క్రీడాకారులకు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయస్థాయిలో రాణించాలన్నారు.ఈ మధ్యనే క్రీడాకారుల అభ్యర్థుల మేరకు ఫుట్బాల్ మైదానం లెవలింగ్ చేయిస్తున్నట్లు వివరించారు.ఉమ్మడి మెదక్ జిల్లా నుండి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నగేష్ సంయుక్త కార్యదర్శి, శిక్షకులు ప్రకాష్, భాగ్యమ్మ, వినయ్ , బాణి మరియు ఫుట్బాల్ అకాడమీ సభ్యులందరినీ కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

## మంథనిలో ఏ, బి, సి, డి ఎస్సీ వర్గీకరణ ఉపసంహారణ కోసం బంధు ప్రశాంతం



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ గత బీజేపీ ప్రభుత్వం 2000 సంవత్సరంలో ఎస్సీ వర్గీకరణ కోసం వత్తాసు పలికి భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ఐదుగురు జడ్జీల తీర్పు తోటి ఎస్సీ వర్గీకరణ చెల్లదని తీర్పు వెలువరించారు గత 20 సంవత్సరాల అనంతరం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మళ్లీ ఏడుగురు సభ్యుల ధర్మాసనం తోటి ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించడం జరిగింది.

గతంలో ప్రభుత్వాలు ఎంఆర్పిఎస్ కు వత్తాసు పలికి చెంప చెల్లుమనే తీర్పు ఇచ్చినప్పటికీ కూడా మరి సామాజిక సమస్య దేశ సమస్య అని ఎస్సీ వర్గీకరణ విషయంలో పార్లమెంటులో రెండు 2/3 వంతు మెజార్టీతో ఎస్సీవర్గీకరణ చేయవచ్చని అనేక తీర్పులు వేలివరించినప్పటికీ కూడా మా మాదిగ సోదరులకు ఇప్పటికి కూడా ఇంకా అర్థం కావడం లేదు. ఇలాంటి పరిస్థితులలో రాజ్యాంగంలో పొందపరిచిన ఎస్సీ వర్గీకరణ విధానాన్ని చేయరాదని బాబాసాహెబ్ అంబేద్కర్ జనాభా ప్రాతిపదిక పైన రిజర్వేషన్లు వాటా ఎంత నేటి పరిస్థితులలో దేశం పరిస్థితులలో ఎస్సీ జనాభా కు అనుగుణంగా ఎవరు రిజర్వేషన్ శాతాన్ని పెంచడం లేదు 1950 ఉన్న రిజర్వేషన్ శాతాన్ని ముక్కలు చెక్కలుగా చేసి కులాల మధ్య సిచ్చు రేపుతున్న ప్రభుత్వాలకు తగిన మూల్యము మాలలే చెల్లించాల్సి వస్తుంది.

ఇకనైనా చౌకబార్ రాజకీయాలకు స్వస్తి పలికి ఏబిసిడి వర్గీకరణ వద్దు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ముద్దు . కలిసి ఉందాం రండి మాదిగలరా నేటి పరిస్థితులలో ఎస్సీ జనాభా శాతం సుమారుగా 28 కోట్లు జనాభా ఉండి కూడా 15% కోసమే సాట్లో తవుడు పోసి కుక్కల కొట్లాట పెట్టిన తీరుగా ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది ఇకనుంచి అయినా మందకృష్ణ మాదిగ కళ్ళు తెరిచి ఈ చౌకబారు రాజకీయాలు మానుకొని మాలలు మాదిగలు కలిసి ఉండే విధంగా రిజర్వేషన్లను పెంచి రెండు కులాలను ఒకటి చేసి తన పేరు స్వార్థకం చేసుకోవాలని మాలలు అధిక సంఖ్యలో పాల్గొని భారత్ బంద్ ను విజయవంతం చేసినారు ఈ కార్యక్రమంలో ఐ ఆర్ వి రాజు, నూకల బానయ్య, జంజర్ల రాజు, ఆర్ల జ్ఞాని, నూకల కమల్ ,అప్పాల పోచమ్మలు, దాసరి గట్టయ్య, రాయద్దండి శంకర్, బండారి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# చిన్న గల్లీ పెద్ద నిర్మాణం

## అక్రమ నిర్మాణాల పై అధికారుల స్పందన ఏది.?

- చైన్ మెన్ల అవినీతి తో నే అక్రమ నిర్మాణాలు
- కాలక్షేపంగా మారిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ కూల్చివేతలు
- రంగులు వేసిన తర్వాత నోటీసులు జారీ చేస్తున్న వైనం



సీతాఫలమండి (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి నార్త్ జోన్ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. అవినీతి అక్రమాలపై నార్త్ జోన్ జూనియర్ కమిషనర్ రవి కిరణ్ స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం మరిచారా.? అన్న అనుమానాలు ఎక్కువవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సీతాఫలం డివిజన్ పరిధిలో ఎదురింటి నెంబర్ 11-3-377/4/ఎ/2 చిన్న గల్లీలో ఐదు అంతస్తుల అక్రమ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని ఓ చైన్ మెన్ ఓ అధికారి కనుసైగల్లోనే ఈ తతంగం అంతా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్న ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరతనట్లు వ్యవహరిస్తున్నారు. పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు స్పెషల్ టాస్క్ ఫోర్స్ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని స్థానికులు అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నోటీసులు జారీ చేయడంలో పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన బుట్ట దాకలుగా మారుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అసలు నోటీసులు ఇస్తున్నారా.?

సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది డ్యూటీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారని అక్రమ నిర్మాణం జరుగుతుంటే అక్రమ నిర్మాణంను గుర్తించి అప్పుడే నోటీసులు ఇవ్వాలి. కానీ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి లక్షల్లో లంచాలు తీసుకొని కేవలం ఒక నోటీసు జారీ చేసి మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ప్రజలు ఫిర్యాదు చేస్తే లేదా పత్రికల్లో కథనాలు వస్తే అప్పుడు రెండవ నోటీసు జారీ చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో నోటీసులు ఇచ్చి కూల్చివెతలు చేయడం లేదు లేదంటే నోటీసులు పక్కన పెట్టి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇచ్చిన నోటీసులను కూడా రికార్డులలో రాయకుండా అసలు నోటీసులు ఇస్తున్నారో లేదో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నోటీసులు కూడా ఇవ్వకుండా ఎన్ని నోటీసులు ఇచ్చారో మీడియాకు తెలపకుండా గుట్టు చప్పుడు కాకుండా మామూళ్లు తీసుకొని విధులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బిల్డింగ్ పూర్తి అయిన తర్వాత రంగులు వేసిన తర్వాత నోటీసులు ఇవ్వడం అంటే అధికారులు, సిబ్బంది ఎంత స్థాయిలో అమ్ముడుపోతున్నారో ఉన్నతాధికారులకే తెలియాలి. ఉన్నత అధికారుల కను సైగల్లోనే ఈ అక్రమ నిర్మాణాల దందా సాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

# పూర్తి రైతులకు రుణమాఫీ కాలేదు





ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకుంటున్న దృశ్యాలు రేవంత్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మూడు విడతలుగా ఆగస్టు 15 వరకు రుణమాఫీ ఇచ్చేస్తా నని చెప్పారు. ఆ వివరాలు పూర్తిగా తీసుకోకుండా కొందరు రైతులకు మాత్రమే రుణమాఫీ చేయడం వల్ల రైతులకు రేవంత్ రెడ్డి ముఖ్య సూచన చేశారు. ఇంకా ఎవరైనా ఉంటే రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడం మూలంగా రైతులు ఏఈఓ కార్యాలయాలు చుట్టూ రోజంతా గడుపుతున్నారు. ముఖ్యమంత్రిగా కాకముందు రైతులకు రెండు లక్షల పూర్తి రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చిన సందర్భంలో ఆగస్టు 15వ తారీకు వాయిదా పెట్టడం జరిగింది. వాయిదాల పద్ధతిలో మూడు విడతలు గా రుణమాఫీ చేశారు. అంతా బాగానే ఉంది కానీ అందులో అర్హులైన వారిని పక్కనపెట్టి ఏ ఒకరిద్దరికి ఇచ్చేసి తూతూ మంత్రంగా ఆగస్టు 15 తారీకు డెడ్లైన్ ను పెట్టి రుణమాఫీ చేశామని చెప్పుకోవడానికి చేసినట్టు కనిపిస్తుంది.రుణమాఫీ కానీ రైతులు ఎక్కడ రోడ్డు ఎక్కుతారోనని రైతులకు దరఖాస్తులు తీసుకుంటున్నామని ఒక కార్యక్రమం మొదలుపెట్టారు. కానీ ఏ ఒక్కరు కు పూర్తిగా రుణమాఫీ చేస్తుంది అని కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టు దాఖలాలు లేవు రైతులు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న కొందరికే రుణమాఫీ చేశారని పట్టా పాస్ బుక్ లో పేరు ఉపయోగాలు ఆధార్ కార్డులో ఒకలాగా ఇది ఒక కారణంగా చూపిస్తున్నారు. రేషన్ కార్డు ఖచ్చితమని రూల్ లేదని అంటున్నారు. కానీ రేషన్ కార్డ్ ని అడుగుతున్నారు ఎవరికి రుణమాఫీ చేస్తున్నారు. అర్థం కాకుండా ఉంటుంది అని రైతులు వాపోతున్నారు. ఉన్నది పేట్ ఏఈఓ లావణ్య మాట్లాడుతూ అందరికీ రుణమాఫీ చేస్తాం అని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే దరఖాస్తులు తీసుకుంటున్నామనీ అంటున్నారు

## కోల్‌కత్తా ఘటనపై కారుణ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరసన

- **హత్యాచార ఘటన నిందితులకు వెంటనే ఉరిశిక్ష విధించాలి**
- **శాంతిభద్రతల రక్షణలో బెంగాల్ సీఎం మమతా పూర్తిగా విఫలం**
- **డాక్టర్ మౌమిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలి**
- **డాక్టర్ దాసి నాగరాజు**





కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచార ఘటనపై బుధవారం నిజాంపేట్‌లోని కారుణ్య స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కారుణ్య సంస్థ వ్యవస్థాపకులు, బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ముందుగా డాక్టర్ మౌమిత చిత్రపటం వద్ద పూలమాల వేసి, క్రొవ్వత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించి, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న కోల్‌కత్తాలోని ఆర్జీకర్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మౌమిత డ్యూటీలో ఉండగా అతి కిరాతకంగా దుండగులు ఆమెపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేయడం చాలా దారుణమని, అత్యంత బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేశారు. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో మానవులు మృగాల్లా మారిపోతున్నారని, మానవత్వం పూర్తిగా మంటగలిసిపోతుందని, దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన చెందారు. దేశంలో రోజురోజుకు హింస ప్రవృత్తి పెరిగిపోతుందని, ఇది సమాజానికి, దేశానికి ఎంతో చేటు కలిగిస్తుందని, దేశంలో నేరాల పట్ల కఠినమైన చట్టాలు రాకుంటే పరిస్థితులు అదుపుతప్పిపోయి హింసాత్మక ఘటనలు పేట్రేగిపోతాయన్నారు. వెస్ట్ బెంగాల్‌లో శాంతిభద్రతలను పరిరక్షించడంలో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం మమతా బెనర్జీ పూర్తగా విఫలమైందని, హత్యాచార ఘటనకు నైతిక బాధ్యత వహించి సీఎం పదవికి మమతా రాజీనామా చేయాలని డాక్టర్ దాసి నాగరాజు డిమాండ్ చేశారు. హత్యాచార ఘటన నిందితులను బెంగాల్ ప్రభుత్వం, హైకోర్టు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి వెంటనే ఉరి తీయాలన్నారు. ఎదిగిన తమ కూతురు మరణ వార్తతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని, వెంటనే బాధిత కుటుంబానికి తగిన విధంగా న్యాయం చేయాలని, రూ. 10 కోట్లు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని టీఎంసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. జోసెఫ్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి ధర్నాను విజయవంతం చేయాలి

**- కొల్చారం మండలం యువత అధ్యక్షుడు సంతోష్ రావు**

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని గురువారం నాడు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ఆదేశాల మేరకు రేపు అనగా తేదీ 22-08-2024 గురువారం నాడు ఉదయం 9:30 నిమిషాలకు కొల్చారం మండలంలోని రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబడును ఈ కార్యక్రమంలో నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునిత లక్ష్మారెడ్డి పాల్గొననున్నారు.ఈ ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కొల్చారం మండలం యువత అధ్యక్షుడు సంతోష రావు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కావున ,మండల పార్టీ అధ్యక్షులు,నాయకులు, మాజీ చైర్మన్ లు, ఎంపీపీలు,జడ్పీటీసీ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు,గ్రామ కమిటీ అనుబంధ కమిటీ అధ్యక్షులు,సభ్యులు, బిఆర్ఎస్వి నాయకులు, కార్యకర్తలు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొనగలరని విజ్ఞప్తి చేశారు.

## అఖిల భారత యాదవ మహాసభ యూత్ కార్యవర్గం

**పెద్దపల్లి** అఖిల భారత యాదవ మహాసభ యువత జిల్లా, నియోజకవర్గ, మండల, స్థాయి కమిటీలను ఎన్నిక చేసినట్లు అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు అట్ల సాగర్ యాదవ్ తెలిపారు. యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లెత్తుల నాగరాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షునిగా చిట్టవెన వినీత్ యాదవ్, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా నర్ల సాయి కృష్ణ యాదవ్, పెద్దపల్లి మండలం యూత్ అధ్యక్షుడిగా భక్తుల లింగయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా రేచవేన సురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చెలుకల వెంకటేష్ యాదవ్, పట్టణ అధ్యక్షునిగా వేల్పుల చంద్ర కుమార్ యాదవులను నియామకం చేసినట్లు సాగర్ తెలిపారు.

ఈ మేరకు బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. రానున్న రోజుల్లో సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానుక శ్రీనివాస్, నల్ల శ్రీకాంత్, అజయ్, అశోక్, తిరుమలేష్, అనిల్, కళ్యాణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు విచ్చేసే భక్తుల
# ఆరోగ్య భద్రత టిటిడి ప్రథమ కర్తవ్యం

**- హోటల్ యజమానులకు ఫాస్టాక్ (ఎఫ్ఓఎస్ టిఏసి) శిక్షణ**
**- టీటీడీ అదనపు ఈవో**



**తిరుమల :** తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతోపాటు వారి ఆరోగ్య భద్రతే టిటిడి అత్యంత ప్రాధాన్యత అని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. టిటిడి ఈవోశ్రీ జె. శ్యామలరావు ఆదేశాల మేరకు టిటిడి ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులకు, యజమానులకు తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ సత్సంగం హాల్లో బుధవారం నాడు జరిగిన శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో ప్రసంగిస్తూ, అన్ని రకాల తినుబండారాలు ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే వేలాది మంది భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం హోటళ్ళను నిర్వహించాలన్నారు. హోటళ్ల లోపల పరిశుభ్రత, ఆహార పదార్థాలు నిల్వ చేయడం, వడ్డించడం వంటి విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించి క్రమబద్ధీకరించడం, తదితర విషయాలను నిశితంగా పరిశీలించాలని ఆయన హోటళ్ల వారికి చెప్పారు. తరువాత న్యూ ఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ శ్రీ సిహెచ్ ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అన్ని రెస్టారెంట్‌లు మరియు తినుబండారాలలో అనుసరించాల్సిన పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక-రసాయన-జీవ ప్రమాదాలు, వృధా వంటి వాటి గురించి వివరించారు, నిబంధనలను ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు వంటి అనేక అంశాలను తెలియజేశారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి మాట్లాడుతూ, ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి తిరుమలలో హోటళ్ల వ్యాపారులందరికీ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల హెల్త్ ఆఫీసర్ మధుసూధన్ రావు, తిరుపతి జిల్లా ఫుడ్ కంట్రోలర్శ్రీ జి. వెంకటేశ్వరరావు, తిరుమల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, తిరుమలలోని హోటళ్ల వ్యాపారులు, టిటిడి అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.

# పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదం



**సి.బెళగల్** సి.బెళగల్ మండలం బ్యాతోలి గ్రామంలో రోడ్డు పక్కలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు ఆకు తీగలు అల్లుకొని ట్రాన్స్ఫార్మర్ కనిపించని స్థితిలో ఉంది. విద్యుత్ శాఖ అధికారులకు ప్రజలు పలుమార్లు ట్రాన్స్ఫార్మర్ ఎత్తు పెంచి, దాని చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విన్నవించిన పట్టించుకోలేదని తెలిపారు.

# గర్భిణీలకు శ్రీమంతాలు



**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం లో గర్భిణీ లకు బుధవారం సామాఖ్య శ్రీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ డి ఎస్తేరు రాణి గ్రామకూటమి నాయకులు మద్దిపాటి బాబి, వీర స్వాములు చిన్నారుల కన్నపురసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**





**తిరుపతి :** వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ఉదయం స్థానిక కలెక్టర్ లోని సమావేశ మందిరం నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో పనులలో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్ లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణల విషయాలు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, పిడి, నేషనల్ హైవే, ఎస్ ఈ, నీటిపారుదల, డీఎఫ్ఓ, అడవులు తదితర శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సదరు అంశాలపై అధికారులు దృష్టి పెట్టి త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నెల్లూరు విజయ రత్నం, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖరయ్య, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ ఇ మదన్ మోహన్, ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం డిటి స్వామినాథన్, తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు
# హత్యలను అరికట్టే సమగ్ర మహిళా చట్టాన్ని చేయాలి




**ఎమ్మిగనూరు** పట్టణంలో కోల్కతాలో ఆర్ జి కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మేడికో పై జరిగిన అత్యాచారం హత్య ఘటనపై సిఐటియు, అంగన్వాడి, ఆశ, ఆటో యూనియన్ల కార్యకర్తలు సోమప్ప సర్కిల్లో నిరసన కార్యక్రమం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పి. గోవిందు , బి. రాముడు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి. గోవర్ధనమ్మ, టౌన్ కార్యదర్శి ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ దేశంలో పసిపిల్లలు మొదలుకొని పండు వృద్ధుల వరకు మహిళలపై రోజురోజుకీ అత్యాచారాలు హత్యలు జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. కోల్కతాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికో పై జరిగిన అత్యాచారం, హత్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ రాష్ట్ర హోం శాఖ మరియు ఆరోగ్య శాఖ నిర్వహిస్తూ ఒక మహిళ డాక్టర్ పై అత్యాచారం జరిగి హత్య చేసిన నిందితులకు సహకరించటం సహించరాన్ని నేరమని ఆమె తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఆసుపత్రి యజమాన్యానికి పశ్చిమబెంగాల్ పోలీస్ డిపార్ట్మెంట్ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కేసు దర్యాప్తును సిబిఐ కి అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు నివేదికను సిబిఐ అందజేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని కోరారు. ఘటనకు సంబంధించి అత్యాచారం, హత్య చేసిన నిందితులకు వెంటనే కఠిన శిక్షలు విధించాలని కోరారు. కోల్కతా ఘటన మరవకముందే మరలా యూపీలో మరో సంఘటన జరగటం దేశంలోని శాంతిభద్రతల పై ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు. మహిళ రక్షణ కొరకు ప్రత్యేక కఠినమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు."ఏ దేశంలో అయితే మహిళ అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరగగలుగుతుందో ఆ దేశ ప్రజాస్వామ్యం నిలకడగా దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని"మహాత్మా గాంధీ గారు చెప్పిన నినాదం నేడు పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యాన్ని పణంగా పెడుతున్నారని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోల్కత్తా ఘటన పై స్పందించాలని కోరారు. కోల్కతాలో జరిగిన ఘటన దేశంలో అన్ని వర్గాల ప్రజలను పోరాట మార్గంలో నడిపించిందని ఇప్పటికైనా బాధ్యులను కఠినంగా శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. దేశంలో మహిళలకు రక్షణ కల్పించినప్పుడే భారతదేశం వికసి త్ భారత్ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు నీరజ, మహేశ్వరి, వరలక్ష్మి, చిట్టెమ్మ, లక్ష్మీదేవి, శశికళ, లతా రాణి, షమీం, గ్రేస్ అమ్మ, మేరీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు శారద, విశాలాక్షి, శివలీల, రాధా, హాజీబీ, మహేశ్వరి, ఏఐకేఎస్ నాయకులు అబ్దుల్లా, సిఐటియు నాయకులు రమేష్, అహ్మద్, రాజు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ నూతన డిఎస్పీగా
# రవికుమార్ పదవీ బాధ్యతలు



ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ నూతన డీ.ఎస్పీగా రవికుమార్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తాను ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ చిరంజీవి, రూరల్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ షేక్ నగీనా నూతన డిఎస్పీ ని కలిసి అభినందనలు తెలియజేశారు.

## సెలవు రోజుల్లో టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ను



## విద్యాసంస్థల్లో నిర్బంధించడం తగదు

**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సెలవులు ఇచ్చి సిబ్బందిని మాత్రం హాజరుకావాలని ఆదేశిస్తున్నారు. బంద్ రోజున రవాణా సౌకర్యాలు ఉండని పరిస్థితులలో సిబ్బంది విద్యాసంస్థలకు రావడం కష్టమవుతుంది అదేవిధంగా పిల్లలకు సెలవులు ఉండడం చేత ఇంటిదగ్గర పిల్లలను చూసుకోవడం కూడా ఇబ్బంది అవుతుంది. పట్టణంలోని శ్రీ చైతన్య నారాయణ,భాష్యం,లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం సంస్థల్లో టీచర్లను సెలవు హక్కు నిమిత్తం ఇళ్లకు పంపించడం జరిగింది జరిగింది. విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నప్పుడు సెలవు విద్యార్థికి మరియు సిబ్బందికి ఇద్దరికీ వర్తిస్తుంది. విద్యార్థులకు మాత్రమే సెలవులు ప్రకటించి

## వాడచీపురుపల్లిలో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ





**పరవాడ :** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వాడచీపురుపల్లి గ్రామం లో మలేరియా పై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. వి.కనక అప్పారావు మాట్లాడుతూ వర్షాలు కురియుట వలన నీరు పల్లపు ప్రాంతంలో నిలువ ఉండటం వలన దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉన్నదిని దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా (బోధకాలు ), మెదడువాపు వ్యాధి మొదలగునవి వస్తాయి అని చెప్పారు. ఈ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని పాడైపోయినా సామాన్లు, పాత టైర్లు, పడేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు, రుబ్బిరోళ్లు, డిస్పాసబుల్ గ్లాసులు మొదలయినవి ఉండరాదని చెప్పారు

అవి ఉండడం వలన దోమలు లార్వా దశ నుండి ఇమగో దశ వరకు పెరుగుతాయి అని అన్నారు అందువలన వారానికి ఒక్కసారి అయ్యిన ఫ్రైడే - డ్రైడే గా పాటించవలెనని అన్నారు దీని వలన దోమలు పెరగకుండా ఉంటాయి. ఈ కార్యక్రమం లో డా. కనక అప్పారావు,హెల్త్ సూపెర్వైసర్ వి సత్యనారాయణ,ఎంపిహెచ్ఏ యు. సత్యనారాయణ, కె.ధనలక్ష్మి, ఏఎన్ఎంలు మొదలైనవారు పాల్గొన్నారు.

# అకాల వర్షాల వల్ల పంట నష్టం పరిశీలన

**- జిల్లా సంయుక్త కలెక్టర్ బి నవ్య**



**పత్తికొండ** నీట మునిగిన రైతుల యొక్క పంట పొలాలలో సందర్శించి ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి నవ్య అన్నారు పత్తికొండ మండలంలో నిన్న కురిసిన అకాల వర్షాల పంటల నీటి మునక కారణంగా గ్రామాలలో పంటల యొక్క నష్టాలను అంచనాలు వేయుటకు ఈరోజు జూటూరు చిన్న ఉల్లి మరియు పెద్ద ఉల్లి నలకదొడ్డి గ్రామాలను సందర్శించడం జరిగినది ఈరోజు మండలంలోని రెవెన్యూ గ్రామాల వారిగా పంట వారీగా అంచనాలను వేయడం జరిగింది పత్తి 260 హెక్టార్లు వేరుశనగ 90 హెక్టర్లు కంది 107 ఎక్టార్లు సజ్జ 20 హెక్టార్లు జొన్న 20 హెక్టార్లు మొత్తము హెక్టార్లు 387 మంది అలాగే ఉద్యాన పంటలు ఉల్లిపాయ టమాటో మరియు ఇతర ఉద్యాన పంటలకు 324 హెక్టార్లను అంచనాలు వేసి 370 రైతుల యొక్క పంట పొలాలు నష్టం వాటిల్లినట్లు అంచనా వేయడం జరిగింది దీనిపై జిల్లా అధికారులకి నివేదిక పంపించడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి నవ్యమాట్లాడుతూ అకాల వర్షాల వలన పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా మండల స్థాయి అధికారులకు అలాగే రైతు సేవ కేంద్రం సిబ్బందికి రెండు మూడు రోజుల తర్వాత నీట మునిగిన రైతుల యొక్క పంట పొలాలను సందర్శించి వారి పొలాలను ఈ పంటలో నమోదు చేసి నష్టపోయిన పంటల యొక్క అంచనాలను మరియు నష్టం జరిగిన పంటను ఫోటో తీసి ఈ పంటలో నమోదు చేయవలసిందిగా ఆదేశించడం అయినది నీట మునిగిన రైతుల యొక్క పంట పొలాలలో సందర్శించి ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం అయినది అలాగే పత్తికొండ ఆర్డిఓ రామలక్ష్మి జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్ వరలక్ష్మి సహాయ సంచాలకులు పత్తికొండ ఏ మోహన్ విజయ్ కుమార్ మండల వ్యవసాయ అధికారి ఏ వెంకటరాముడు ఉద్యాన శాఖ అధికారి డి దస్తగిరి ఎమ్మార్వో వెంకటలక్ష్మి ఒఇూ లు వీఆర్వోలు రైతు సేవా కేంద్రం సిబ్బంది గ్రామ సర్పంచులు మరియు రైతులు పాల్గొనడం జరిగినది

# సెబీ చైర్ పర్సన్ రాజీనామా చేయాలి

**విశాఖపట్నం** ఆదాని గ్రూప్ లో సెబీ చైర్మన్ మాధబి పూరి బుచ్ పెట్టుబడులు పెట్టారని వస్తున్న వార్తల నేదప్యంలో ఆమే తన పదవికి రాజీనామా చెయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గురుదీప్ సింగ్ సప్పల్ డిమాండ్ చేశారు. విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ఆదానీ గ్రూపులో వెలాది కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. సెబీ చైర్మన్ పై పలు ఆరోపణలు చేసిన ఆయన ... తక్షణమే ఆమే పదవికి రాజీనామా చెయాలని డిమాండ్ చేశారు. కూటమి పిలుపుతో దేశంలో అన్నీ ఈడీ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

# తాడిపత్రి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**- ముగ్గురు మృతి**



**అనంతపురం** తాడపత్రి మండలం కడప రోడ్డులో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ కారు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరొకరు తుది శ్వాస విడిచారు. ఈ ఘటనపై తాడపత్రి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది...

# బ్లూ కోల్ట్స్ సిబ్బందికి నూతన టాబ్స్

**- అందజేసిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**



**సిద్దిపేట** డయల్ 100 కాల్స్ కి తక్షణమే స్పందించి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలి. ప్రజల ధనమాన ప్రాణ రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించాలి. డయల్ 100 రాగానే ఎలాంటి అలసత్వం వహించకుండా వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలి పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఈ సందర్భంగా మాట్లాడుతూ. రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్ పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని, ప్రజల ధన మాన ప్రాణ రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించాలని సూచించారు. డయల్ 100 కాల్ ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్కు రాకుండా వారు ఉన్న ప్రదేశానికి పోలీసులు సేవలందించే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసుల సేవలు తప్పనిసరిగా అవసరం అనుకున్నప్పుడు మాత్రమే ఆపద సమయాలలో డయల్ 100 కు కాల్ చేసి సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ మల్లేశం గౌడ్, ఐటీ కోర్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, మరియు బ్లూ కోర్ట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు ఘటనలో ఒకరి మృతి

**వికారాబాద్** వికారాబాద్ మండలం పీరంపల్లిలో విషాదం చోటు చేసుకుంది. మంగళవారం కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురయిన వారిలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. దుర్గయ్య అనే వ్యక్తి కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు.. విరోచనాలు కావడంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పోందుతున్న దుర్గయ్య మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మంగళవారం అస్వస్థతకు గురైన మిగతా వారందరూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు తీసుకొని బాగానే ఉన్నప్పటికీ దుర్గయ్య మృతితో అస్వస్థతకు గురైన వారిలో సైతం ఆందోళన మొదలైంది.

# అరకులో భారత్ బంద్

**అరకు** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలం గా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కొన్ని వర్గాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవు తోంది. దీనిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ తీర్పున కు వ్యతిరేకంగా భారత్ బంద్కు పిలుపునిచ్చాయి. ఏ.బి. సి. డి. లు గా వర్గీకరించిన ఎస్సీ. వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తలపెట్టిన భారత్ బంద్ అరకు లోయలో స్వచ్ఛందంగా వాణిజ్య సముదాయాలు హోటల్స్ ను మూసివేశారు. ఎక్కడ అవాంచనియ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను కట్టు దిట్టం చేశారు.

# నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి అనకాపల్లి కలెక్టర్ ఎస్పీ రాక

**అనకాపల్లి** నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ , జిల్లా ఎస్పీ దీపిక పరామర్శించారు. ఆసుపత్రిలో చిన్నారుల తల్లిదండ్రులను జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చిన్నారులకు మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అనుమతులు లేని ఆశ్రమాల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు.

# ఆరాధన ట్రస్ట్ నిర్వహాహకుడు పాస్టర్ కిరణ్ కుమార్ అరెస్టు

**అనకాపల్లి** చిన్నారుల మృతికి కారణమైన పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ సర్వాకుడు పాస్టర్ కిరణ్ కుమార్ ను పోలీసులు అరెస్టు చేసారు. జిల్లా ఎస్పీ ఎం దీపికా మాట్లాడుతూ నిర్వాహకుడు కిరణ్ కుమార్ పై 304 పార్ట్ 2 సెక్షన్ కింద హత్యకేసు నమోదు చేసి అరెస్టు చేసాం. పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన మందిరంలో 86 మంది చిన్నారులు ఉన్నారు.

దాతలు విరాళంగా ఇచ్చిన పాడైన బిర్యాని పిల్లలకు పెట్టడం వలన సంఘటన చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తిన్న ముగ్గురు చిన్నారులు మృతిచెందగా, 35 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నిర్వాకుడు కిరణ్ కుమార్ అస్వస్థత గురైన విద్యార్థులను ఆస్పత్రిలో చేర్చకుండా, ఇళ్లకు పంపడం వలన పరిస్థితి విషమించింది. ట్రస్ట్ నిర్వహణలో లోపాలున్నాయి. సంఘటనకు కారణమైన అందరి పైన చట్టపరమైన చర్యలు తప్పవు. ట్రస్ట్ కు లైసెన్సు, హాస్టల్లో మౌలిక సదుపాయాలు లేవు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టామని అన్నారు.

# అచ్యుతాపురం సెజ్లో ఘోర ప్రమాదం

**- 18 మందికిపైగా తీవ్ర గాయాలు**

**అనకాపల్లి** అచ్యుతాపురం సెజ్లోని ఎసెన్సియా కంపెనీలో రియాక్టర్ పేలి ప్రమాదం సంభవించింది. ఘటనలో 18 మందికి పైగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కి స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం భోజన సమయంలో ప్రమాదం జరగడంతో కాస్త పెను ప్రమాదం తప్పింది. ఘటనలో చుట్టూ గ్రామాల్లో పొగలు అలముకున్నాయి. ప్రజలు భయాందోళనలో వుండిపోయారు.

# విగ్రహం ధ్వంసమైనా పట్టించుకోరా...?



**శ్రీకాళహస్తి** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అనేందుకు అనేక ఉదాహరణలున్నాయి. త్రినేత్ర అతిథి గృహం ముందు వివిధ రకాల విగ్రహాలను సిమెంటుతో నిర్మాణం చేశారు. నెల రోజుల క్రితం ఒక నంది విగ్రహానికి పగుళ్లు వచ్చాయి. ఈ అతిథి గృహానికి ఎదురుగా ఆలయ పరిపాలన కార్యాలయం ఉంది. అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రతిరోజు పగిలి పోయిన నంది విగ్రహాన్ని చూస్తూనే ఉన్నారు. అయితే కనీసం తొలగించే చొరవ కూడా తీసుకోవడం లేదు. ప్రతిరోజు ప్రముఖులు వచ్చి వెళ్లే మార్గంలో ఉన్న ఈ గ్రహాన్ని తొలగించడంతో పాటు కొత్త విగ్రహాన్ని నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. ఇఓ ఎస్ వి ఎన్ మూర్తి దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవలసి ఉంది...

# రైతు భరోసా కేంద్రం నకు, సొసైటీలకు ఎరువులు సప్లై చేయాలి

**- సీపీఎం. డిమాండ్**

**కౌతాళం** మండలంలో ఈ సంవత్సరం ముందుగా వర్షాలు రావడం వల్ల రైతులు పత్తి, మిరప, వేరుశనగ, ఉల్లిగడ్డలు, కొర్రలు మొదలైన పంటలు వేసినారు. మండలంలో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం మండలంలో మంచి వర్షాలు రావడం వల్ల రైతుల ఎరువుల కోసం ప్రైవేట్ అంగళ్లు చుట్టు తిరుగుతున్నారు .అంగడి యజమానులు రైతులును అవసరాలు చేసుకొని అధిక ధరలకు ఎరువులను అమ్ముతున్నారు.. ప్రభుత్వము రైతులను దృష్టిలో ఉంచుకొని రైతు భరోసా కేంద్రం నకు, సహకార సంఘాలకు (సొసైటీలు) ఎరువులు సప్లై చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య డిమాండ్ చేసినారు. గతంలో సొసైటీలకు ,రైతు భరోసా కేంద్రమునకు ఎరువులు రావడం వల్ల రైతులు స్థానికంగా ఎరువులు తీసుకుని పొలాలకు వేయడం వల్ల లగేజీలు ,ప్రయాణ ఖర్చులు, అధిక రేట్లు రైతులకు తగ్గేవి. కనుక వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా ప్రవేట్ ఎరువుల వ్యాపారస్తుల నుంచి రక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఎరువులు నుంచి రైతులను ఆదుకొనకపోతే రైతు సంఘంగా రైతులందరిని సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించినారు.

# ఏసీబీ అధికారులకే చుక్కలు చూపించిన స్వూర్తి రెడ్డి

**హైదరాబాద్** రంగారెడ్డి జిల్లా మణికొండ జల మండలి మేనేజర్ స్వూర్తి రెడ్డి ఏసీబీ అధికారులకు చుక్కలు చూపించారు. కొత్త నల్లా కనెక్షన్ కోసం రూ. 30 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ ఈమెను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే విచారణ కోసం తాను ఉంటున్న ఇల్లు అడ్రస్ చెప్పకుండా రెండు గంటల పాటు ఏసీబీ అధికారులను తప్పుదోవపట్టించారు స్వూర్తి రెడ్డి. చివరకు సరైన అడ్రస్ చెప్పడంతో పుప్పాల గూడలో ఆమె ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు డివిజన్-18 మణికొండ మేనేజర్గా స్వూర్తిరెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. అయితే మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన బొమ్మ ఉపేంద్రనాథ్రెడ్డి కొత్తగా నిర్మించుకున్న భవనానికి కొత్త నీటి కనెక్షన్లు తీసుకునేందుకు అధికారులను కలిశాడు. ఈ క్రమంలో నీటి కనెక్షన్ కోసం స్వూర్తి రెడ్డి రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మేనేజర్ స్వూర్తిరెడ్డి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రూ. 30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.



# తాడిపత్రిలోనే ఉంటా...

**- జేసీ ఆరాచకాలపై పోరాడుతా**

**అనంతపురం :** తాడిపత్రిలో పరిస్థితి ప్రస్తుతానికి అదుపులోకి వచ్చినప్పటికీ భవిష్యత్లో ఎప్పుడైనా మరోసారి ఘర్షణలు జరిగే ప్రమాదం లేకపోలేదు. తాజాగా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేసిన కామెంట్స్ అందుకు సాక్ష్యంగా మారుతున్నాయి. తాను కచ్చితంగా తాడిపత్రిలోనే ఉంటానంటున్న వైసీపీ నేత... జేసీ అరాచకాలపై పోరాటం కొనసాగిస్తానంటూ చెప్పుకొచ్చారు. ఎన్నికల అనంతరం చాలా కాలం తర్వాత తొలిసారి పెద్దారెడ్డి తాడిపత్రి రావడంతో ఒక్కసారి ఆ ప్రాంతం భగ్గమంది. ఆ ప్రాంతంలోకి పెద్దారెడ్డి వస్తే ఘర్షణలు తలెత్తి ప్రమాదం ఉందని చెప్పినా ఆయన రావడంతో టీడీపీ వర్గీయులు తిరుగుబాటు చేశారు. అధికారుల అనుమతి లేకుండా ఎలా వస్తారంటూ ఆయన్ని నిలదీసేందుకు పెద్దారెడ్డి ఇంటి వైపుగా వెళ్లారు. పోలీసులు కలుగు చేసుకోవడంతో అక్కడ ఘర్షణపూరిత వాతావరణం నెలకొంది. పెద్దారెడ్డి ఇంటిని చుట్టుముట్టిన జేసీ అనుచరులు దాడికి యత్నించారు. ఇంతలో ఆయన వెళ్లిపోయారని తెలుసుకొని వెళ్లిపోతున్న టైంలో వైసీపీ లీడర్, పెద్దారెడ్డి అనుచరుడు మురళి గన్ చూపించి కవ్వింపు చర్యలకు దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేతిరెడ్డి పెద్దారెడ్డి తనకు కావాల్సిన కొన్ని పత్రాల కోసం తీసుకొని వెళ్లిపోయినప్పటికీ పరిస్థితులు వేడెక్కాయి. వైసీపీ టీడీపీ శ్రేణులు దాడులు చేసుకున్నారు. కందిగోపుల మురళి ఇంటిని, కార్లను ధ్వంసం చేశారు. వీటన్నింటిపై స్పందించిన పెద్దారెడ్డి తాను ఇలాంటి వాటికి భయపడే వాడిని కానన్నారు. చట్టపరిధిలో ఏం చేయాలో అది చేస్తానని అన్నారు. జేసీ అక్రమాలపై పోరాడుతూనే ఉంటానని చెప్పారు. టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన నేతలకు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ దాడిలో వద్ద రఫీ అనే వైసీపీ కార్యకర్తపై దాడి చేశారని అందకే తమ కార్యకర్తలు తిరగబడ్డారని పెద్దారెడ్డి చెబుతున్నారు. అధికారంలో ఉన్న జేసీ అరాచకాలపై పోరాడానని తనపై కక్ష పెంచుకున్నారని అన్నారు. జేసీ బ్రదర్స్ ఎన్ని కుట్రలు చేసినా తాను మాత్రం తాడిపత్రి వెళ్లి తీరుతాను అన్నారు.

# మీకు చెబితే అర్థం కాదా

**- ఆళ్లను మందలించిన సుప్రీం కోర్టు**

**న్యూఢిల్లీ :** తెలంగాణలోని ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టుకు వెళ్లిన మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణా రెడ్డికి గట్టి షాక్ తగిలింది. ఆయన వేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం కొట్టేసింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు పాత్రపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తూ.. ఆళ్ల రామక్రిష్ణారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను ధర్మాసనం కొట్టేయడమే కాకుండా ఆళ్ల రామక్రిష్ణా రెడ్డిని కూడా మందలించింది. ఆ విషయంలో గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించింది. తెలంగాణలో పదేళ్ల క్రితం జరిగిన ఓటుకు నోటు కేసులో టీడీపీ చీఫ్ చంద్రబాబును కూడా నిందితుడిగా చేర్చాలని కోరుతూ మంగళగిరి వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణారెడ్డి గతంలో సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణను సీబీఐకు అప్పగించాలని, తద్వారా కేసులో పారదర్శకత పెరుగుతుందని మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఎన్నోసార్లు విచారణ జరిపి వాయిదా వేస్తూ వచ్చింది. తాజాగా వాటిని కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది.

# జనగాంలో 47 మంది టీచర్లకు షోకాజ్

**వరంగల్ :** జనగాం జిల్లాలోని వివిధ పాఠశాలలో విద్యార్థుల హాజరు 25 శాతం కంటే తక్కువగా ఉన్నందుకు ఏకంగా 47 మంది ప్రధానోపాధ్యాయులకు షో కాజ్ నోటీసులు జారీచేశారు. జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రజ్వాన్ భాషా ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి తాజాగా ఈ షాకాజ్ నోటీసులు ఇచ్చారు. అంతటితో ఆగకుండా 60 కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులకు అఒ లీవ్ లను శాంక్షన్ చేసినందుకు హెడ్ మాస్టర్ లను బాధ్యులుగా చేస్తూ ఏడుగురు హెడ్ మాస్టర్ లకు జనగామ జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. మొత్తం 54 మంది హెచ్ఎంలకు జిల్లా విద్యా శాఖ అధికారి రాము షోకాస్ నోటీసులు జారీ చేశారు. షో కాజ్ నోటీసులు అందుకున్న వారిలో ప్రాథమిక, హై స్కూల్ హెడ్ మాస్టర్ లు ఉన్నారు.

# ప్రతిపక్ష నేతగా బొత్స సత్యనారాయణ

**వరంగల్ :** ఏపీ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బొత్స సత్యనారాయణ నియామకం అయ్యారు. ఫ్లోర్ లీడర్ పదవికి లేళ్ల అప్పిరెడ్డి రాజీనామా చేశారు. బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం దూరంగా ఉండడంతో వైసీపీ నుంచి బొత్స సత్యనారాయణ మాత్రమే బరిలో ఉన్నారు. దీంతో ఆయనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మండలి చైర్మన్ మోషేన్ రాజు తన ఛాంబర్లో బొత్స సత్యనారాయణతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, సంయుక్త కార్యదర్శి యం.విజయరాజు పాల్గొన్నారు.

# వంద రోజుల్లో లక్షా 20వేల ఇళ్లు

**విజయవాడ :** వంద రోజుల్లో లక్షా 20వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యమన్నారు మంత్రి కొలుసు పార్థసారథి. రాబోయే రోజుల్లో మొత్తంగా 7 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందని తెలిపారు. గృహనిర్మాణ శాఖపై సమీక్షించిన ఆయన.. గత ప్రభుత్వం సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా భూములు తీసుకుందన్నారు. రాజకీయ కక్షపూరిత ఆలోచనలు కారణంగా ఇళ్ల లబ్ధిదారులు ఇబ్బందిపడ్డారన్నారు. 2014-2019 గృహ నిర్మాణాలపై కొన్ని ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని.. వాటికి కూడా డబ్బు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు పార్థసారథి. గత ప్రభుత్వంలో గృహనిర్మాణాలను వ్యాపార ధోరణిలో చూశారని విమర్శించారాయన. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాలను క్వాలిటీ చెక్ చేస్తామన్నారు మంత్రి పార్థసారథి. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని.. అయితే రుణం తీసుకుని ఇల్లు నిర్మాణం చేపట్టని వారు భవిష్యత్తులో ఇబ్బందిపడతారన్నారు.

ఏపీలో కొత్త ఇల్లు నిర్మించుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నాయి. దీంతో పాటు ఉపాధి హామీ పథకం కింద అదనంగా రూ.30 వేలు సైతం చెల్లిస్తారు. కాగా గృహ నిర్మాణాల్లో మట్టి కోసం కొత్త విధానం ఆలోచించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మట్టికి బదులుగా ఫ్లై యాష్ను ఉపయోగించే విధంగా ఆలోచన చేస్తున్నామన్నారు. మంత్రి పార్థసారథి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చింది వైసీపీ. తమ హయాంలో కోట్లాది రూపాయల భూముల్ని పేదలకు పంచామన్నారు ఆ పార్టీ నేత కాకాణి గోవర్ధన్. ఎన్నికల సమయంలో ఇళ్ల నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు లక్షన్నర మాత్రమే ఇస్తాననడం సరికాదన్నారాయన. గత ప్రభుత్వం వరదలొచ్చే ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు కేటాయించిందని అధికార టీడీపీ విమర్శిస్తుంటే.. వైసీపీ మాత్రం తమ నిర్ణయాలతో ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిందంటోంది. మొత్తానికి పేదలకు ఇళ్ల కేటాయింపుపై రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది

## పరువు నష్టం కేసులో సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు

చేసింది. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లా వైరా సభలో రేవంత్ తప్పుడు ప్రచారం చేశారని కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి గెలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని నిరాధార ఆరోపణలు చేశారని రేవంత్ పై పిటిషన్ వేశారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ పార్టీకి పరువు నష్టం కలిగిందని ఆయన తన పిటిషన్‌లో తెలిపారు. వెంకటేశ్వర్లు వేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన కోర్టు పిటిషనర్ వాంగ్మూలం సేకరించింది. బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియోలను సైతం పిటిషనర్ కోర్టుకు సమర్పించారు. బుధవారం ఈ పిటిషన్ విచారించిన నాంపల్లి కోర్టు సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది.

## లోక్‌సభ ఎన్నికల సమయంలో రిజర్వేషన్ల రద్దు రచ్చ

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వివాదాస్పదంగా మారిన అంశం రిజర్వేషన్ల రద్దు. బీజేపీ అగ్రనేతలు మత పరమైన రిజర్వేషన్లు అవసరం లేదని వ్యాఖ్యానించారు. దీన్ని కాంగ్రెస్ నేతలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేసినా, అంతగా సఫలం కాలేకపోయారు. బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు రద్దు చేస్తుందని.. ముస్లిం రిజర్వేషన్లు సైతం రద్దు చేస్తుందని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీనిపై బీజేపీ నేతలు అదే సమయంలో తీవ్ర విమర్శలు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించకపోగా, రాజ్యాంగాన్ని సైతం రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలో రిజర్వేషన్లు రద్దు, పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

## రేవంత్ రెడ్డి దూకుడు.. బలమా.? బలహీనతా.?

సగం ఖాళీ చేసేసి కేసీఆర్‌కు పెద్ద షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో కూడా బీఆర్ఎస్ పార్టీని దెబ్బ కొడితేనే కేసీఆర్‌ని కట్టడి చేయగలమని గ్రహించి దెబ్బ తీసి, ఫామ్‌హౌస్‌లో నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారు.

### అనేక ఎదురుదెబ్బలు తిని..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో రాజకీయంగా ఎదిగారు. అంతకుముందు రాజకీయాల్లో ఉన్నా తెలంగాణ ఉద్యమమే కేసీఆర్‌కు గుర్తింపు తెచ్చింది. ముఖ్యమంత్రిని చేసింది. ఇక రేవంత్‌రెడ్డి కూడా రాజకీయాల్లో అంత సుఖమైన ప్రయాణం సాగించలేదు. అనేక డక్కీమొక్కీలు తిన్నారు. టీడీపీలో ఓటుకునోటు కేసు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి స్థాయికి వచ్చారు. శ్రీరాముడు వానర సైన్యంతో మహా శక్తిశాలి అయిన రావణుడిని వదించినట్లే , తన మాట అసలు వినని వానర సైన్యం వంటి కాంగ్రెస్ నేతలను వెంటబెట్టుకొని రేవంత్ రెడ్డి, రాజకీయాల్లో అపర చాణక్యుడని పేరు గుర్తింపు ఉన్న కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించారు. పామ్‌హౌస్‌కు పరిమితం చేశారు.

### ఆ ఇద్దరూ కొరకరాని కొయ్యలా

కేసీఆర్ అంతటివాడిని రేవంత్ రెడ్డి ఓడగొట్టారనే విషయం మరిచిన కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యలా తయారయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. సబ్జెక్ట్, లెక్కల ఆధారంగా రేవంత్‌రెడ్డిని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డికి కావలసింది కూడా అదే. లేకుంటే ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యల జాబితా కొండంత ఉంది. కేటీఆర్, హరీశ్‌రావుతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు పోరాటాలు చేస్తూ ప్రజల దృష్టిని సమస్యలపై నుంచి మళ్లిస్తున్నారు. ఇక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోయినా, రేవంత్ రెడ్డి దూకుడు, వ్యూహాలను, వైఫల్యాలను నిశితంగానే గమనిస్తున్నారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చేశాక కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి దూకుడుకి చెక్ పెడతారని తెలుస్తోంది. ఆ ప్రయత్నంలోనే కేసీఆర్ బీజేపీ పెద్దలతో తెర వెనుక రాయబారాలు నడుపుతున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపిస్తున్నారు. అంటే కేసీఆర్ వలన ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డి కూడా గ్రహించిన్నట్లు భావించవచ్చు. అందుకే కాంగ్రెస్ మంత్రులు కోరుకుంటున్న స్వేచ్ఛ, గౌరవం, ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ఎవరూ పక్క చూపులు చూడకుండా జాగ్రత్తపడుతున్నారు.

### బీజేపీ-బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేలా

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేతులు కలిపినా ఎదుర్కొనేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ కలవకూడాదనే తరచూ కుమ్మక్కు ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ కలిస్తే అప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారం తీసుకోవాల్సి ఉంటుంది.

ఈ విషయం కూడా రేవంత్ రెడ్డి చాలా ముందే పసిగట్టారని చెప్పవచ్చు. అందుకే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అభినందనలు తెలిపి విభజన సమస్యలపై చర్చలకు ఆహ్వానించారని అనుకోవచ్చు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఉండటం చంద్రబాబు నాయుడుకి ఎంత ముఖ్యమో, అదేవిదంగా ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడుగా ఉండటం రేవంత్‌రెడ్డికి కూడా అంతే అవసరం. అప్పుడే వారు తమ ఉమ్మడి శత్రువులు జగన్, కేసీఆర్‌ను కట్టడి చేయగలుగుతారు. అందుకే రేవంత్ రెడ్డి కాస్త దూకుడుగానే ముందుకు సాగుతున్నారు. ఈ దూకుడు, వ్యూహాలు, అప్రమత్తం మాత్రమే సరిపోదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు తీర్చడం కూడా చాలా అవసరం.

## చంపైయి సోరెన్ కొత్త పార్టీ

కలుగుతుదంని బీజేపీ వ్యూహకర్తలు అంచనాకు వచ్చినట్లుగా తెలుస్తోంది. అందుకే ఆయనను పార్టీలో చేర్చుకోవడం కన్నా సొంత పార్టీ వైపు ప్రోత్సహించారని అంటున్నారు.

### బొత్సకు డబుల్ బొనాంజా

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే కాలంలో ఉత్తరాంధ్ర ప్రాంతం విశాఖ ఒకేలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రస్తుతానికి వైసీపీది 3 రాజధానుల విధానమేనని తేల్చి చెప్పారు. 3 రాజధానుల విషయంపై తమ పార్టీ విధానం మార్చాలనుకుంటే తమ అధినేత వైఎస్ జగన్‌తో మాట్లాడి చర్చించుకుంటామని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు

. ఒకవేళ తమ పార్టీ విధానం మారితే చెబుతామని ఆయన వెల్లడించారు. ఇక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పిన బొత్స స్థానిక నేతలు, వైసీపీ నేతలకు ముఖ్యంగా పార్టీ అధ్యక్షుడు జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని ప్రస్తుతానికి కేవలం 75 రోజులు మాత్రమే పూర్తి అయిందన్నారు. ఏపీలో జరుగుతున్న అరాచకాలపైనే ఢిల్లీలో పోరాడామని బొత్స వెల్లడించారు.

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూ సేకరణకు ఆదేశాలు

దక్షిణ భాగం సంగారెడ్డి- ఆమన్‌గల్- షాద్ నగర్- చౌటుప్పల్ (మొత్తం 189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయిందన్నారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్రంతో చర్చించి, పనుల విషయంలో ముందుకు సాగాలని రేవంత్ సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్ లో సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలన్నారు.

తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించి, అందజేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా అధికారులకు రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాల్నారు. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేలా నిర్మాణాలు ఉండాలని సూచించారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ ల అనుసంధానానికి అనువుగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగపడేలా చూడాలన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం పాల్గొన్నారు.

## అచ్యుతాపురం సెజ్‌లో పేలిన రియాక్టర్

ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మరో 50 మందికిపైగా గాయపడినట్లు సమాచారం. రియాక్టర్ పేలుడు ధాటికి భవనం కూలిపోగా దాని శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని చనిపోయి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. సహాయక చర్యలు పూర్తయితే మృతుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నేడు అచ్యుతాపురం సెజ్‌లో చంద్రబాబు పర్యటించనున్నారు.ఇక ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటే లిమిటెడ్‌లో జరిగిన ఈ ప్రమాద తీవ్రత చూస్తే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే వాదన వ్యక్తం అవుతోంది. ఈ కంపెనీలో వందలాది మంది కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అయితే కంపెనీలో లంచ్ బ్రేక్‌లో ఈ భారీ పేలుడు సంభవించడంతో మరింత ప్రాణ నష్టం జరగకుండా కాపాడినట్లు అయిందని ఫ్యాక్టరీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే రియాక్టర్ పేలుడు ధాటికి భారీగా మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఇక ఆ ప్రాంతం మొత్తం దట్టంగా పొగ కమ్ముకోవడంతో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఇక పేలుడు ధాటికి పలువురు కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురుగా ఎగిరిపడి ఛిద్రమైనట్లు పేర్కొన్నారు.మరోవైపు రియాక్టర్ పేలుడు కారణంగా వచ్చిన శబ్దంతో ఆ కంపెనీలో ఉన్న కార్మికులు ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ బయటికి పరుగులు తీసినట్లు ప్రత్యక్షంగా చూసిన వారు తెలిపారు. ఇక ఈ భారీ శబ్దానికి పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 11 ఫైర్ ఇంజిన్‌లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేశాయి. ఇక గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం అనకాపల్లిలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. మంటలు అంటుకుని కాలిన గాయాలతో ఏడుగురు మృత్యువాత పడగా మొదటి అంతస్తు కుప్పకూలడంతో శ్లాబు కింద చిక్కుకుని మరో ఏడుగురు చనిపోయారు. ఇక శిథిలాల కింద మరికొందరు ఉంటారని అనుమానిస్తున్నారు. ఇక మరో 50 మందికి పైగా గాయపడగా వారిలో ఐదుగురు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి మరింత విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ప్రమాద సమయంలో ఆ ఫ్యాక్టరీలో దాదాపు 300 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల్లో ఫైర్ సిబ్బందితోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. అచ్యుతాపురం సెజ్‌లో చోటు చేసుకున్న ఘోర ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇక నేడు సంఘటనా స్థలాన్ని సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించనున్నారు. రియాక్టర్ పేలుడు ఘటన దురదృష్టకరమని కార్మికశాఖ మంత్రి సుభాష్ తెలిపారు. భారీగా పొగవల్ల సహాయక చర్యలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. సంఘటనా స్థలంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిస్థితిని సమీక్షిస్తున్నారని మృతుల వివరాలు తెలిసేందుకు మరికొంత సమయం పడుతుందని చెప్పారు.

## నాకు ఏ ఫాం హౌస్ లేదు

కాంగ్రెస్ నాయకుల నిర్మాణాలు కూడా కూల్చేయాలి. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల రాజభవనాలు కూడా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నాయి. వాటిని కూడా కూల్చేయాలి." అంటూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.మరోవైపు అధికారంలోకి వచ్చిన రోజే రూ. 2 లక్షల రుణమాఫీ అంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారని రేవంత్ రెడ్డిపై మరోసారి విమర్శలు గుప్పించారు కేటీఆర్. ఇప్పటికైనా "మేము రుణమాఫీ చేయలేకపోయాం. మావల్ల కాలేదని చెబుతారు" అని అనుకున్నామని.. కానీ అలా జరగలేదని చెప్పుకొచ్చారు. రుణమాఫీ అనేది ఓ బూటకమని, పచ్చి దగా, పచ్చి మోసం అంటూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రవ్వంత రుణమాఫీ చేసి కొండంత డబ్బా కొట్టుకున్న ముఖ్యమంత్రి బండారం 70 లక్షల మంది రైతుల సాక్షిగా బట్టబయలైందని చెప్పుకొచ్చారు. వ్యవసాయ శాఖ మంత్రేమో రూ. 2 లక్షలు మాఫీ చేశాం అంటూ ప్రకటన చేశారని కానీ కొన్ని పత్రికలు రుణం పూర్తిగా మాఫీ కాలేదంటూ వార్తలు రాశాయని పేర్కొన్నారు. జరిగింది రుణమాఫీ కాదని రైతులకు టోపీ పెట్టారని మండిపడ్డారు. ఎక్కడికక్కడ తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారని బ్యాంకులను ముట్టడిస్తున్నారని ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతులకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్పుకుందని కానీ జరిగింది మోసమని కేటీఆర్ విమర్శించారు. మాకెందుకు రుణమాఫీ జరగలేదని రైతులు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ కాలేదు కాబట్టే రాష్ట్రవ్యాప్తంగా రణరంగంగా మారిన పరిస్థితి ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలంలో బజార్ హత్నూర్‌లో రైతులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. ఏ పార్టీ ప్రేరేపించకుండానే రైతులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ జరగలేదని ఆందోళన చేస్తే రైతులపై 7 సంవత్సరాలు జైలు శిక్ష పడేలా కేసులు పెట్టి ఈ ప్రభుత్వం వేధిస్తుందని తెలిపారు. రైతుల మీద నాన్ బెయిలబుల్ కేసులు పెడుతోందన్నారు.రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్నారని.. కానీ వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం ఇంకా రుణమాఫీ కావాల్సి ఉందంటున్నారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రికి మంత్రులకు మధ్య అసలు సయోధ్య లేదని ఆరోపించారు. సాంకేతిక అంశాల ఆధారంగా రుణమాఫీ జరగలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్తున్నారని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలు ఏమీ లేవని కేవలం రుణమాఫీ ఎగ్గొట్టేందుకే ఇలా కారణాలు చెబుతున్నారని ఆరోపించారు.రుణమాఫీ చేసింది పావు శాతం మాత్రమేనని కానీ రైతులను వంద శాతం మోసం చేశారని కేటీఆర్ తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంకా 12 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని చెప్పినట్టు వివరించారు. ఏడున్నర వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు చేరిందని ఉపముఖ్యమంత్రే చెబుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. అసలు ఈ ప్రభుత్వానికి రుణమాఫీ పైన స్పష్టత ఉందా లేదా అన్నది తెలియటం లేదన్నారు. రైతులకు ఇచ్చింది ఎంతో కనీసం ప్రభుత్వానికి, మంత్రులకైనా తెలుసా? లేదా? అని ప్రశ్నించారు.రైతు స్వరాజ్యమంటూ కాంగ్రెస్ పెద్ద ఎత్తున చేసుకున్న ప్రచారం నిజం కాదని కేటీఆర్ తెలిపారు. రైతు రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అదే రైతులను ఏడిపిస్తూ మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసానికి నిరసనగా రేపు రైతులు ధర్నా చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ డ్రామాలు ఇక నడువవన్నారు. రుణమాఫీ పూర్తిగా ఎప్పుడు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు కేటీఆర్.తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయమన్నందుకు ముఖ్యమంత్రి మాట్లాడిన బజారు భాషకు వ్యతిరేకంగా తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసి రేపటి ధర్నాను ప్రారంభించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ రైతుల వెంట ఉన్నంతసేపు రైతులను ఏపార్టీ మోసం చేయలేరన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎప్పటిలోగా మీరు రుణ మాఫీ చేస్తారో ఈ ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు షురూ

గ్రామాల్లో ఎన్నికల పండుగ గట్టిగానే జరగనుంది. ఇప్పటికే సర్పంచులు పదవీకాలం పూర్తవగా పంచాయతీ ఎన్నికల కోసం ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే పలు సందర్భాల్లో సీఎం రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రస్తావించగా రైతు రుణమాఫీ పూర్తయిన వెంటనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే అధికారులు కార్యాచరణ షురూ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రోజున పంచాయతీ ఎన్నికల నిర్వాహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితాల తయారీ, ప్రచురణపై అధికారులతో చర్చించారు. ఓటరు జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం(ఆగస్టు 21న) షెడ్యూల్ విడుదల చేసింది.

అసెంబ్లీ ఓటరు లిస్టుల ఆధారంగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితాల తయారీ, ప్రచురణ కోసం షెడ్యూల్ విడుదల చేయనున్నారు.సెప్టెంబర్ ఆరో తేదీన వార్డులు, గ్రామ పంచాయతీల వారిగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలపై ఆయా జిల్లాల్లో మండల అభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు తయారు చేసి గ్రామ పంచాయతీల్లో ప్రచురించనున్నారు. ఆ డ్రాఫ్ట్ ఓటరు జాబితాలపై జిల్లా కలెక్టర్లు, మండల అభివృద్ధి అధికారులు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి, మండల స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు.

వారి సూచనలు, సలహాలు స్వీకరించనున్నారు. ఈ డ్రాఫ్ట్ ఓటరు లిస్టులపై సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 13 వరకు సంబంధిత జిల్లా పంచాయతీ అధికారులు లేదా మండల అభివృద్ధి అధికారులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటిని 19వ తేదీలోగా పరిష్కరించనున్నారు. అనంతరం సెప్టెంబర్ 21వ తేదీన వార్డుల వారీగా, గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌లలో ప్రచురించనున్నారు. ఈ ఓటరు లిస్టుల తయారీ ప్రచురణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈనెల 29న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించనున్నారు.

## టెన్షన్ పెడుతున్న మంకీపాక్స్

ఒక వ్యక్తిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో కేంద్రం హైలర్ట్ ప్రకటించింది. ఎయిర్‌పోర్టులు, దేశ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపడుతోంది. మంకీపాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. దేశంలో ఎంపాక్స్ కేసులు బయటపడితే చికిత్స కోసం మూడు ఆస్పత్రులను నోడల్ వైద్య కేంద్రాలుగా ప్రకటించారు. వాటిలో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రి ఒకటి. రెండోది సఫ్దార్‌గంజ్ ఆస్పత్రి, మూడోది లేడీ హార్డింగ్ హాస్పిటల్. ఈ ఆస్పత్రుల్లో మంకీపాక్స్‌కు చికిత్స అందించనున్నారు. అందు కోసం ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రాల్లోనూ నోడల్ కేంద్రాలను గుర్తించి ఎంపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది.

### దేశంలో ఎంపాక్స్ విజృంభిస్తుందా.?

భారత్ దేశంలో గతంలో ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతున్న ఈ దశలో కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గత ఏడాది జులై నాటికి దేశంలో 27 మంకీపాక్స్ కేసులు ఉన్నాయని పార్లమెంట్‌లో నాటి కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సింగ్ బఘేల్ ప్రకటించారు. ఈ 24లో 15 కేసులు ఢీల్లోలో 12 కేసులు కేరళలో ఉన్నట్టు చెప్పారు. అయితే ఇప్పుడు మళ్లీ వైరస్ విజృంభిస్తోంది. ఎంపాక్స్ ప్రమాదకరంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ క్రమంలో దేశంలో మళ్లీ ఎంపాక్స్ కేసులు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. అందుకే కేంద్రం అలర్ట్ అయ్యింది. వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వైరస్‌ను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఫోకస్ పెట్టింది.

### వైరస్ వ్యాప్తిని ఎలా అడ్డుకోవాలి.?

దేశంలో వైరస్ వ్యాపి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల ట్రావెల్ హిస్టరీని నమోదు చేయడం చాలా అవసరం. ముఖ్యంగా ఎంపాక్స్ కేసులు ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వాళ్లలో ఎవరికైనా ఎంపాక్స్ లక్షణాలు అంటే జ్వరం, ఒంటిపై దద్దర్లు వంటిని ఉన్నాయేమో టెస్ట్ చేయాలని. అందుకు ఎయిర్‌పోర్టుల్లో టెస్టింగ్ సెంటర్లు పెంచాలి.

### మంకీపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏం చెప్తోంది.?

ఎంపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఊరటనిచ్చే విషయం చెప్పింది. కోవిడ్‌లా మంకీపాక్స్ ప్రమాదకర వైరస్ కాదని తెలిపింది. ఈ వైరస్ వ్యాపిని నియంత్రించే అవకాశాలు ఉన్నాయిని చెప్పింది. కోవిడ్ సమయంలో వ్యవహరించినట్టే ఎంపాక్స్ విషయంలోనూ అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలిగితే ఎంపాక్స్‌ను కూడా తరిమేయొచ్చని చెప్పింది ప్రపంచ ఆరోగ్య సంస్థ.

### మంకీపాక్స్ లక్షణాలు ఏంటి.?

మంకీపాక్స్ సోకిన వాళ్లకు కనిపించే ముఖ్యమైన లక్ష్యం ఒంటిపై దద్దుర్లు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, మనిషి బలహీనపడటం, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటివి ఉంటాయి. ఒంటిపై దద్దుర్లు పండుగా మారి చీముతో నిండిన గాయంగా మారుతుంది. పుండ్ల మానిపోయి కొత్త చర్మం ఏర్పడే వరకు ఈ వ్యాధి ఇతరకు వ్యాపించే అవకాశం ఉంటుంది. కొంతమందిలో ఒంటిపై దద్దుర్లు ముందుగా కనిపిస్తే మరికొందరిలో మరో లక్ష్యం బయటపడుతుంది. వ్యాధి సోకిన వారికి సన్నిహితంగా ఉంటే వారిలో వారం రోజుల్లో వైరస్ లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందిలో 21 రోజుల్లో కూడా కనిపించవచ్చు. వైరస్ సోకిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల పాటు వ్యాధి లక్షణాలు ఉంటాయి.

## వచ్చే నెలలోనే జనగణన ప్రారంభం

వాయిదా వేసింది. అయితే ఆ తర్వాత కొవిడ్ వైరస్ వ్యాప్తి తగ్గిపోయినా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికలతో మరోసారి వాయిదా పడుతూనే ఉంది. అయితే జనగణన ప్రక్రియ నిర్వహించడం లేదని కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ సర్కార్‌పై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. తాజాగా ఈ వార్తలు రావడం గమనార్హం. తాజాగా వచ్చే నెల నుంచి దేశంలో జనాభా లెక్కల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ జనగణన సెప్టెంబర్‌లో ప్రారంభం అయితే.. కొత్త సర్వే పూర్తి కావడానికి దాదాపు 18 నెలలు పట్టే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నాయి. ఇక ఈ జనగణనకు సంబంధించి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది ఆమోదం రావాల్సి ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇక దేశంలో జనాభా లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టే కేంద్ర హోంశాఖ, కేంద్ర గణాంకాల శాఖలు కాల పరిమితిని నిర్ణయించాయని కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. 2026 మార్చి నాటికి 15 సంవత్సరాల డేటాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అయితే దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, గణాంకాల శాఖ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. ఇక దేశంలో జనగణన, జాతీయ జనాభా నమోదు ప్రక్రియ కోసం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-2025 బడ్జెట్‌లో రూ.1,309.46 కోట్లు కేటాయించారు. అయితే 3 ఏళ్ల క్రితం జనగణనకు చేసిననా కేటాయింపులతో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం. 2021-2022 బడ్జెట్‌లో జనగణనకు రూ.3,768 కోట్లను ప్రతిపాదించినప్పటికీ.. కరోనా కారణంగా అది ముందుకు సాగలేదు. ఇక దేశంలో జన గణన ఆలస్యం కావడంపై పలువురు నిపుణులు ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇతర గణాంక సర్వేల నాణ్యతపై ఈ జనాభా లెక్కింపు ప్రక్రియ ప్రభావం చూపిస్తుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చాలా వాటికి 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుంటున్నారని తెలిపారు. ఇక ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలిచిందని గత ఏడాది ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదిక వెల్లడిస్తోంది. జనాభా విషయంలో చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే తొలి స్థానంలో ఉందని పేర్కొంది. 1950 లో ఐక్యరాజ్యసమితి జనాభా లెక్కల సమాచారాన్ని వెల్లడించడం మొదలుపెట్టిన తర్వాత ప్రపంచ జనాభా జాబితాలో భారత్ తొలిసారిగా ప్రథమ స్థానంలో నిలిచింది.

## రేవంత్, హరీష్ ఎవరొచ్చినా ఓకే

పాటు సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా మంత్రి సంజయ్ ప్రస్తావించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కేటీఆర్ ఒక్కడే అమాయకుడిలా మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్‌ది కాకుండా గతంలో రేవంత్ రెడ్డిపై ఎందుకు నమోదు చేశారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఫామ్ హౌస్ సొంతమా.? ఇప్పుడు లీజుకు తీసుకున్నారా.? అని నిలదీశారు. అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్‌లు కూల్చివేతలను తాను సమర్థిస్తున్నట్టు స్పష్టం చేశారు. గజాల్లో కట్టిన ఇళ్లను హైడ్రా (హైదరాబాద్ డిజిస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) అధికారులు కూల్చివేస్తున్నారన్న బండి సంజయ్.. భారీ భవన నిర్మాణాలు సాగించిన యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన హైడ్రా కలెక్షన్ల కోసమేనని బండి సంజయ్ ఆరోపించారు.

### ఎన్నికలకు డబ్బులు పంపాలన్న అధిష్టానం

సీఎం రేవంత్ రెడ్డిపైనా బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర, హర్యాన ఎన్నికల కోసం డబ్బులు పంపించాలని సీఎం రఏవంత్ రెడ్డికి హైకమాండ్ లక్ష్యాన్ని విధించిందంటూ ఆరోపించారు.

ఈ క్రమంలోనే హైడ్రా ఆవిర్భవించిందంటూ ఆయన పేర్కొన్నారు. అధిష్టానం ఆదేశాలతో రేవంత్ రెడ్డి ఇబ్బందుల్లో పడ్డారన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ పార్టీ ఎందుకు దూరంగా ఉందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పార్టీకి లాభం చేసేందుకు కాదా.? అని మంత్రి ప్రశ్నించారు. లిక్కర్ కేసులో అరెస్టు అయిన కవిత బెయిల్ కోసం అభిషేక్ మను సంఘ్వి తీవ్రంగా కృషి చేశారన్న మంత్రి బండి సంజయ్.. ఆయన రుణం తీర్చుకునేందవుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కలిసి రాజ్యసభకు పంపిస్తున్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ కేసీఆర్ చెప్పినట్టే నడుస్తోందని ఆరోపించారు. మరికొన్ని రోజుల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలో విలీనం కావడం ఖాయమన్న సంజయ్.. ఈ మేరకు ఇరు పార్టీలు మధ్య లోపయికారీ ఒప్పందం నడుస్తోందని ఆరోపించారు. అందుకోసమే విగ్రహాల గొడవను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు గురించి ఎక్కడ ప్రశ్నిస్తామన్న ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి ముందుగా విగ్రహాలు అంశాన్ని తెరపైకి తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు.


సచివాలయం ముందు మాజీ ప్రధాని వాజపేయి విగ్రహం నెలకొల్పాలని తమకు ఉందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మంచిదని, ఆ దిశగా దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు. విగ్రహాల అంశాన్ని పక్కనపెట్టి, పరిపాలనపై దృష్టి సారించాలని సూచించారు.



### టాలెంట్‌కు వేదికగా
# సోషల్ మీడియా
## ఇమాన్వీ ఎంపికపై హను రాఘవపూడి

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా కోసం కథానాయికగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ ఎస్మాయిల్‌ను చిత్రబృందం ఎంపిక చేసింది. ఈ సినిమాలో కథానాయికగా ఆమెను ఎంచుకోవడంపై దర్శకుడు హను రాఘవపూడి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వల్ల కొత్త టాలెంట్‌ను వెతికి పట్టుకోవడం సులభ మైందన్నారు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో కొత్త టాలెంట్‌ను వెలికితీయడంలో సామాజిక మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తమ కథకు అనుగుణంగా నటీనటులను ఎంపిక చేసుకోవడంలో ఫిల్మ్‌మేకర్స్‌కు సోషల్‌మీడియా ఎంతో సాయం చేస్తుంది. ఇమాన్వీ అందం, ప్రతిభ కలిగిన అమ్మాయి. అందరిలాగానే నేనూ ఆమె డ్యాన్స్ వీడియోలు చూస్తుంటా. ఆమె మంచి భరతనాట్యం డ్యాన్సర్. కళ్లతోనే ఎన్నో హావభావాలను పలికిస్తుంటుంది. అందుకే ఆమెకు ఒక అవకాశం ఇవ్వాలనుకున్నా అని హను చెప్పారు. ఆడిషన్స్, స్క్రీన్ టెస్ట్ అనంతరమే ఆమెను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆమెను సెలెక్ట్ చేయడం తన ఒక్కడి నిర్ణయం కాదని.. చిత్రబృందం మొత్తం నిర్ణయమని ఆయన తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితం కానుంది. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇమాన్వీ విషయానికి వస్తే.. ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌గా ఆమె యువతకు సుపరిచితురాలు. హిందీతో పాటు, తెలుగు, తమిళ పాటలకూ ఆమె వేసే స్టెప్‌లు ఎంతగానో అలరిస్తాయి. దాదాపు 7 లక్షల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా ప్రకటించిన తర్వాత ఆ సంఖ్య మరింత పెరిగింది.

### రాముడి పాత్రధారికి
# ప్రశాంత చిత్తం అవసరం



నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'రామాయణ' పేరుతో ఇది రానుంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ రాముడిగా కనిపించనున్నారు. అయితే, రాముడిగా ఈ హీరోనే ఎంపిక చేసుకోవడంపై తాజాగా బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాముడి పాత్ర పోషించాల్సినవారికి ఉండాల్సిన ప్రధాన లక్షణం ప్రశాంతత. రణ్‌బీర్ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. అందుకే నితేశ్ తివారీ అందరికంటే అతడిని ముందుగా ఎంపిక చేశారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపిక సరైనదని సినిమా చూశాక ప్రేక్షకులకు కచ్చితంగా అర్థమవుతుంది. నేను రణ్‌బీర్‌తో కలిసి చాలా ప్రాజెక్ట్‌లకు వర్క్ చేశాను. నటనలో ఆయనతో ఎవరూ పోటీ పడలేరు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలా ఉంటాడు' అంటూ రణ్‌బీర్‌పై ముఖేశ్ ప్రశంసలు కురిపించారు. ఇందులో అగ్రనటీనటులు భాగం కానున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మూడు భాగాలుగా దీన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. మొదటి పార్ట్‌ను 2025 దీపావళికి తీసుకురావాలని ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇక దీని వీఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్‌ల కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్‌ఈజీ (ఆఔఇఉ)తో సంప్రదింపులు జరిపిందట. ఈ సినిమాకు తెలుగు వెర్షన్ సంభాషణలు రాసే బాధ్యతను చిత్ర బృందం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కు అప్పగించినట్లు సమాచారం.

# సరిపోదా శనివారం...
## మీ అందరితో కలిసి చూస్తా
### – హీరో నాని సంచలన ప్రకటన




నాని హీరోగా నటించిన సరికొత్త చిత్రం 'సరిపోదా శనివారం' వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కింది. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆగస్టు 29న విడుదల కానుంది. ఈనేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో పాల్గొన్న నాని సినిమా గురించి పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. అభిమానులను ఉద్దేశించి నాని మాట్లాడుతూ.. 'మన మధ్య ఒక నమ్మకం, బంధం ఉంది. మన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే సినిమా ఇది. ఇప్పుడే చెబుతున్నా సినిమా హాళ్లు.. సినిమా హాళ్లలా ఉండవు. కాన్సర్ట్‌లా మారనున్నాయి. జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అదరగొట్టేస్తున్నారు. ఈ చిత్రాన్ని మీ అందరికీ చూపించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. సుదర్శన్ 35 ఎంఎంలో మీ అందరితో కలిసి సినిమా చూస్తా. నాతో సినిమా చూడ్డానికి వచ్చే ప్రతి అభిమాని చేతికి ఇలాంటి వస్త్రాన్ని కట్టుకుని రావాలి. కలుద్దాం. కలిసి సెలబ్రేట్ చేసుకుందాం. 24న ప్రీ రిలీజ్ జరగనుంది. ఆరోజు చాలా విశేషాలు చెబుతాం అని అన్నారు. అనంతరం దిల్‌రాజు మాట్లాడుతూ.. ఎస్.జె.సూర్య గురించి ముఖ్యంగా చెప్పాలి. 'గేమ్ ఛేంజర్' షూట్‌లో ఆయన ఎక్కువగా 'సరిపోదా శనివారం' గురించే మాట్లాడుతున్నారు. ఈ సినిమా విశేషాలను చెబుతున్నారు. దీనికి సంబంధించిన విషయాలను నాకు తరచూ షేర్ చేసినందుకు ఆయనకు థాంక్స్ చెప్పాలి. ట్రైలర్ రిలీజ్ అయిన వెంటనే నాని, నిర్మాత దానయ్య, దర్శకుడు వివేక్‌కు కాల్ చేశా. 'ఎంసీఏ', 'దసరా' చిత్రాలను ఇది తప్పకుండా బీట్ చేస్తుందని నేను నమ్ముతున్నా అని తెలిపారు. గతంలో నేనొకసారి దిల్‌రాజును కలిశా. ఎలాంటి దర్శకులతో వర్క్ చేయాలనుకుంటున్నావు? అని ఆయన నన్ను అడిగారు. దానికి నేను వేణు మంచి దర్శకుడని.. చక్కగా సినిమాలు తెరకెక్కిస్తున్నాడని.. అలాంటివారితో వర్క్ చేయాలని ఉందని చెప్పా. అది మేము సరదాగా మాట్లాడుకున్నాం. కొన్ని రోజులకు అది బయటకు వచ్చింది. మా కాంబోలో తప్పకుండా సినిమా ఉంటుంది. అది ఎప్పుడు అనేది చెప్పలేనని నాని తెలిపారు.



### కథకు తగ్గ పాత్రను చేయడం
# ఇష్టం: శ్రీనిహ

చిత్రపరిశ్రమలో ఎంతో మంది ప్రతిభ కలిగిన నటీనటులున్నారని, అలాంటి వారికి సినిమాల్లో అవకాశాలు రాకపోవడం ఎంతో బాధగా ఉందని యువ నటి శ్రీనిహ అన్నారు.'50-50' చిత్రంలో హీరోయిన్ చెల్లెలి పాత్ర ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన శ్రీనిహ 'ఆణ్ దేవతై', 'సైకో', హీరో సంతానం నటించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'ఇంగే నాంగ దాన్ కింగు' వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించింది. ప్రస్తుతం '8 తోట్టాగల్' ఫేం వెట్రి, సీనియర్ నటుడు సత్యరాజ్ ప్రధాన పాత్ర లో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ మూవీలో కీలక పాత్ర పోషిస్తుంది. హీరోయిన్‌గా నటించడానికి అన్ని రకాల అర్హతలున్నప్పటికీ ఆమెకు కేవలం చిన్నచిన్న పాత్రలకే పరిమితమైంది. ఈ క్రమంలో ఇప్పటివరకు తన సినీ ప్రయాణంపై ఆమె స్పందిస్తూ, 'కంటెంట్ బాగుంటే ఎలాంటి పాత్ర అయినా పోషించేందుకు సిద్ధంగా ఉన్నాను. నృత్య శిక్షణ సమయంలో ఉన్నప్పుడు తొలిసారి మోడలింగ్‌లో అవకాశం రావడంతో అంగీకరించి అప్పటినుంచి అనేక వాణిజ్య ప్రకటనలో నటించానని తెలిపింది.

తర్వాత సినిమాల్లో నటించే అవకాశం వరించిందరని, దర్శక ద్వయం జేడీ-జెర్రీలతో కలిసి పనిచేశానుని తెలిపింది. అయితే ఆ తరహా ఒకే తరహా, గ్లామర్ ఎక్స్‌పోజింగ్ పాత్రలు వరుసగా వస్తుండటంతో వాటిని నిరాకరించానని పేర్కొంది. కథ డిమాండ్ చేస్తే గ్లామర్‌గా నటించడంలో తప్పులేదనీ, కేవలం సినిమా కోసం గ్లామర్‌గా నటించడం ఇష్టం లేదు. వైవిధ్యభరితమైన పాత్రల్లో నటించాలన్నది నా కోరిక. సంతానంతో కలిసి నటించడం మంచి అనుభవం. ఆయన నన్ను కోలీవుడ్ ప్రియాంకా చోప్రాగా వర్ణించడం మరిచిపోలేని అనుభూతి. తమిళ చిత్రపరిశ్రమలో కేవలం హీరోయిన్ పాత్రలకు మాత్రమే కాకుండా, ఇతర పాత్రలకు కూడా తమిళ కళాకారులకు అవకాశాలివ్వాలన్నారు.


విలన్‌తో సహా అన్ని రకాల పాత్రలు పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆమె పేర్కొన్నారు.

### భారతీయ చిత్రపరిశ్రమపై
## చిన్నచూపు: రిషబ్ శెట్టి



బాలీవుడ్ చిత్రపరిశ్రమపై కాంతార హీరో సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో భారతదేశాన్ని బాలీవుడ్ చిత్రాలు తక్కువ చేసి చూపిస్తున్నాయన్నారు. ఇటీవలే ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారతీయ సినిమాలు, ముఖ్యంగా బాలీవుడ్ చిత్రాలు భారతదేశాన్ని తక్కువ చేసి చూపిస్తున్నాయి. ఈ కళాత్మక చిత్రాలను గ్లోబల్ ఈవెంట్‌లకు ఆహ్వానిస్తారు. రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతారు. నా దేశం, నా రాష్ట్రం, నా భాష.. వీటన్నింటి గురించి సానుకూలంగా ఎందుకు చూపించకూడదు..? దేశం గర్వపడేలా సినిమాలు తీయాలని ప్రయత్నిస్తున్నాను. నా సినిమాల ద్వారా భారతదేశాన్ని పాజిటివ్ నోట్‌లో చూపించాలనుకుంటున్నా' అని చెప్పుకొచ్చారు. రిషబ్ శెట్టి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రిషభ్ శెట్టి తెరకెక్కించిన 'కాంతార' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎంతటి ప్రభంజనం సృష్టించిందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లోనూ ఈ చిత్రం సత్తా చాటింది. ఈ సినిమాలో నటనకు గానూ రిషబ్ షెట్టి ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు గెలుచుకోవడమే కాకుండా.. ఉత్తమ ప్రేక్షక ఆదరణ అందించిన చిత్రంగా కాంతార నిలిచింది. దీంతో రిషబ్ శెట్టిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

### పుష్ప-2 పై ర్యూమర్స్
# కంటిన్యూ...




ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం పుష్ప-2 క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. పుష్పరాజ్‌గా మొదటిపార్ట్‌తో అల్లు అర్జున్ తన నటనతో, సుకుమార్ తన టేకింగ్‌తో ఎంతటి సన్సేషన్ సృష్టించారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచి రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రం నుంచి ఇప్పటి వరకు వచ్చిన రెండు సాంగ్స్ చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. అంతేకాదు ఈ సినిమా నుంచి వదిలిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు కూడా అనూహ్య స్పందన వచ్చింది. మొదటగా ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేద్దామనుకున్నారు. అయితే చిత్రీకరణ బ్యాలెన్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పెండింగ్‌గా వుండటంతో డిసెంబర్ 6కు చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇక అప్పటి నుంచి ఈ చిత్రంపై పలు రూమర్స్ వస్తున్నాయి, అల్లు అర్జున్, సుకుమార్‌ల మధ్య గొడవలు, ఈ సినిమా మళ్లీ వాయిదా వేస్తారు. సమ్మర్‌కు రిలీజ్ చేశారు. ఇలా రకరకలా ఊహగానలు ఈ చిత్రంపై వున్నాయి. అంతేకాదు మెగాస్టార్ ఫ్యామిలీకి, అల్లు ఫ్యామిలీకి మనస్పర్థలు వచ్చాయని అల్లు అర్జున్ తన ఫ్రెండ్ కోసం వైసీపీ అభ్యర్థిని సపోర్ట్ చేయడంతో బన్నీని మెగా క్యాంప్ దూరం పెట్టిందని ఇలా రకరకాల ప్రచారాలు వున్నాయి.అయితే ఇవన్నీ అసత్య ప్రచారాలన్నీ పలు సార్లు మెగాస్టార్ కాంపౌండ్, అల్లు ఫ్యామిలీ వాళ్లు చెప్పినా.. రూమర్స్ ఆగడం లేదు.

# మల్కాజిగిరి సర్కిల్‌లో విచ్చల విడిగా వెలుస్తున్న అక్రమ షెడ్లు

**- అమ్ముడుపోయిన టౌన్ ప్లానింగ్ అధికారులు**
**- అంతు పట్టని సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ అవినీతి లీలలు**
**- చక్రం తిప్పుతోన్న చోట నేతలు**





**మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా బారీషెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల, ప్రజా ప్రతినిధుల అండదండలతోనే బారీ షెడ్ల నిర్మాణాలు వెలుస్తోన్నాయనే ఆరోపనలున్నాయి. ఇక్కడి షెడ్ల నిర్మాణాలను అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల భారీగా లంచాలు తీసుకొని మౌనంగా ఉంటున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతుంటే అధికారులకు వస్తున్న అవినీతి సంపాదన సరిపోవడం లేదన్నట్లు పూర్తి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ షెడ్ల నిర్మాణాలు చేయించడం ఎక్కడ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ తుల్జాసింగ్ కు పరిపాటిగా మారింది. అయితే వీటిలో కొన్ని షెడ్ల నిర్మాణాలకు చోటా నేతలే కీలకంగా మారి అన్ని తామే చూసుకుంటామంటూ చక్రం తిప్పుతున్నారు. అధికార పార్టీ నాయకులే అక్రమ నిర్మాణాలకు, బారీ షెడ్లకు అండగా నిలుస్తున్నాడనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ రవి కిరణ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి స్పందించి అక్రమంగా వెలుస్తోన్న షెడ్లపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### సెక్షన్ ఆఫీసర్ అవినీతి లీలలు ఆపేది ఎవరు.?

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ అవినీతికి అంతం లేకుండా పోయింది. ఎక్కడ చూస్తే అక్రమ నిర్మాణాలు ఎక్కడ చూసినా అక్రమ షెడ్లు పత్రికల్లో కథనాలు వచ్చిన ఈయనకు లెక్కుండదు ఎందుకంటే ఉన్నతాధికారులకు సైతం ఈయన తీసుకున్న నైవేద్యంలో వాళ్లకు ఇంత ప్రసాదం పెడతాడన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే ఈ అధికారి అవినీతిపై ఏ అధికారులు చర్యలు తీసుకునే సాహసం చేయరు. చివరికి సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ సైతం ఈ అవినీతి అధికారిని వెనుకేసుకు రావడంతో ఇంకేముంది. ఏదైనా డబ్బుకు దాసోహమే అలాగే మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్ గా మార్చిన ఘనత సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ కే దక్కుతుందని స్థానిక నేతలు ఆరోపించిన పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. అవినీతి అంటే ఇలా దర్జాగా చేయాలి ఉన్నత అధికారులు సహకారం కూడా ఇలా ఉండాలి.

# ఉప్పల్ సర్కిల్లో అధికారుల అవినీతి లీలలు

**- చెప్పే వివరాలకు చేసే పనికి ఎక్కడ పొంతన ఉండదు**
**- కూల్చివేతలు చేస్తారు అన్ని తూతూ మంత్రంగానే**
**- లంచాలు ఇచ్చిన వాళ్ల పై విశ్వాసం, నెల జీతం ఇస్తున్న ప్రభుత్వానికి పంగనామాలు**
**- ఉప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి లీలలకు కట్టడి ఎప్పుడో**






ప్రజాప్రశ్న
చిల్కానగర్ రహదారిపై అక్రమ నిర్మాణాల జోరు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది. లంచాలే పరమావధిగా కల్లి బొల్లి కబుర్లు చెబుతూ అధికారులు అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకపక్క జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కఠినంగా వ్యవహరించిన ఉప్పల్ కాప్రా సర్కిల్ అధికారులలో మాత్రం ఏమాత్రం స్పందన లేకుండా పోయింది. అధికారులకు లంచాలు వస్తే చాలు ఏ అధికారి చెబితే మాకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఉప్పల్ సర్కిల్ లో టౌన్ ప్లానింగ్ విభాగం నందు సెక్షన్ ఆఫీసర్ సురేష్, ఎసిపి వెంకట్ రమణ ఇక ఆడిందే ఆటగా మాడింది. అధికారుల మాటలకు వాళ్ళు చేసే డ్యూటీకి అసలు పొంతన ఉండదు. వీళ్ళ మాటలు వింటే ఎంత నిజాయితీ అంటే హరిచంద్రునికి అన్న తమ్ముడిలా చెబుతారు వాస్తవాలను చూస్తే అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటాయి. కూల్చివేతలు చేస్తారు ఎలా అంటే తూతూ మంత్రంగా మళ్ళీ నిర్మాణదారుడు ఎంత ఈజీగా అంటే అంత ఈజీగా చేసుకునే విధంగా కూల్చివేతలు చేస్తారు. ఎందుకంటే విశ్వాసం లంచాలు తీసుకున్న విశ్వాసం అన్నట్లుగా మారింది ఈ అధికారుల పరిస్థితి. అక్రమ నిర్మాణాలు ఎక్కడ కనిపించిన ఈ అధికారులు కూల్చివేస్తాం, చర్యలు తీసుకుంటున్నం నోటీసులు ఇచ్చినం అని చెప్పడం తప్ప అందుకు తగ్గట్లుగా కూల్చివేతలు కనిపియ్యవు ఎందుకంటే జోనల్ కమిషనర్ జిహెచ్ఎంసి కమిషనర్ ఈ అధికారుల అవినీతిపై కఠినంగా వ్యవహరించారు. కనీసం షోకాజు నోటీసులు ఇస్తారా అంటే అది లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానితో ఉన్నత అధికారులు అంటే వీళ్లకు ఎలాంటి భయం ఉండదు. ఉన్నత అధికారులు అంటే టౌన్ ప్లానింగ్ అధికారులకు అసలే లెక్క ఉండదు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్ మాత్రం ఉండి ఉపయోగం లేదని ఫిర్యాదులు ఇస్తే సెక్షన్లకు ఫార్వర్డ్ చేసి చేతులు దులుపుకోవడం తప్ప డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ ఎక్కడ కనిపించదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిల్కానగర్ రహదారిపై అక్రమ సెల్లార్తో అక్రమ అంతస్తుల నిర్మాణం చేసిన ఇప్పటివరకు నోటీసులు ఇచ్చుకూడా కూల్చివేతలు చేయలేదంటే ఏసీపీ సెక్షన్ ఆఫీసర్ ఎంత మంచిగా నైవేద్యం తిన్నారో.? వాళ్ళ ఉన్నత అధికారులకే తెలియాలి. ఇప్పటికైన జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి ఈ అధికారుల అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపిస్తే చర్యలు తీసుకుంటారేమో వేచి చూడాలి.

# బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభం

**- లాంఛనంగా ప్రారంభించిన కిషన్ రెడ్డి**
**- హామీలకు సిఎం రేవంత్ తూట్లు పొడిచారని విమర్శ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) :** బీజేపీ సభ్యత్వ నమోదు ఉత్సవ్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ క్లాసిక్ గా÷-డ్గ÷న్స్ లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి విజయ రహత్కర్ హాజరవగా.. అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక్క గ్రామంలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని కిషన్ రెడ్డ్గి ÷ర్ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై సైతం కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పద్ధతిలోనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలకు సీఎం రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. రైతు రుణమాఫీని రేవంత్ రెడ్డి గందరగోళంగా మార్చారని కిషన్ రెడ్డ్గి ÷ర్ అయ్యారు. దేవుళ్ళపై ఒట్లు వేసిన సీరేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం రుణమాఫీ కూడా పూర్తి కాలేదని కిషన్ రెడ్డి తెలిపారు. రుణమాఫీపై పూర్తి వివరాలను ప్రజలు ముందు ప్రభుత్వం ఉంచాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ.. వ్యక్తులు, కుటుంబాల కోసం నడిచే పార్టీ కాదని.. పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావటమే బీజేపీ లక్ష్యమన్నారు. బీజేపీ అధికారికంలోకి రావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ ముక్తి దివస్ ను ఘనంగా నిర్వహిస్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో సభ్యత నమోదులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబాల కోసం అవినీతికి పాల్పడుతున్న పార్టీలను తరిమికొడతామన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీని మించిన ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

# 2 లక్షల రుణమాఫీ అమలు చేశాం

**- అందని వారు అధికారులను సంప్రదించాలి**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి**



**ఖమ్మం (ప్రశ్న న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేశామని చెప్పారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆశించామని చెప్పారు. రుణమాఫీ పొందలేని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలు, మండల ఆఫీసుల్లో అధికారులను పెట్టి వివరాలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని, పదేళ్ల పాటు రైతుల్ని మోసం చేసిన పార్టీ ముసలి కన్నీరు కారుస్తోంది. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ కూడా మాట్లాడుతోంది. అసత్యాలు చెప్పి రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారు. రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. బ్యాంకులు, అధికారులు ఏమైనా తప్పు చేస్తే.. వాటిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోంది. 41,78,892 మంది రైతులు రుణాలు తీసుకున్నారని బ్యాంకులు చెప్పాయి. వారి బకాయిలు రూ.31వేల కోట్లు ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా రూ.2లక్షలలోపు రుణాలే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ పనులు చూసుకోవాలి' అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.






Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588